
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



గుంటూరు జిల్లా వార్తలు

5

శుక్రవారం 6 డిసెంబరు 2024



పట్టుబడిన నిందితుడు మునెయ్య, స్వాధీనం చేసుకున్న ఆభరణాలతో పోలీసులు (ఫైల్)

రికవరీలో.. గోల్‌మాల్?

ఓ బంగారు దుకాణంలో.. పదేళ్ల క్రితం కిలోకి పైగా బంగారం.. నాలుగు కిలోల వెండి.. 3.39 లక్షలకు పైగా నగదు చోరీ జరిగింది. అయితే ఆ చోరీకి పాల్పడిన దొంగను ఎట్టకేలకు పోలీసులు పట్టుకున్నారు. కానీ అతడి నుంచి 96 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకోగా అందులో 40 గ్రాములకుపైగా నాసిరకమని తేలింది. దొంగ దొరికితే అతడు చోరీ చేసిన సొత్తు ఏమైందో పోలీసులు చెప్పడంలేదు. పైగా అరకొర సొత్తును తీసు కోవాలని పోలీసులు ఆ దుకాణ యజమానిపై ఒత్తిడి తెస్తున్నారు. రికవరీలో గోల్‌మాల్ జరిగిందని అందరికీ అర్థమవుతున్నా.. ఏదోలా కేసును క్లోజ్ చే యడంపైనే పోలీసు అధికారులు ప్రయత్నిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి. అంతపెద్దమొత్తంలో బంగారం, వెండి, నగదు చోరీ అయితే రికవరీలో భారీ తేడా ఎలా అన్న విషయంపై పోలీసు అధికారులు కనీసం ఆలోచించడం లేద ని.. ఇందులోనే మతలబు ఉందన్న ఆరోపణలు వస్తున్నాయి. పోలీసు ఉన్నతాధి కారులు స్పందించి ఉన్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశిస్తేనే ఈ చోరీ కేసుల రికవరీ వెనుక ఉన్న వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది.

- దొంగ దొరికాడు.. 96 గ్రాములే స్వాధీనం
- అందులో 40 గ్రాములకు మించి నాసిరకం బంగారం
- ఏడాదిగా తీసుకునేందుకు ముందుకు రాని యజమాని
- తీసుకోవాలంటూ బంగారు దుకాణదారుడిపై పోలీసుల ఒత్తిడి

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చోరీ సొత్తు రికవరీలో అనేక అనుమానాలు.. పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నా.. పోలీసు అధికారుల మీనమేషాలకు కారణమైన ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. క్రోసూరు మండలం ఊటుకూరుకి చెందిన బొగ్గవరపు మణికంఠ అనే వ్యక్తి అచ్చంపేటలో గంగాభవాని జ్యువెలర్స్ అనే బంగారం దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. 2014 నవంబరు 29న ఆయన షాపులో చోరీ జరిగింది. దొంగలు షాపులో కిలోకి పైగా బంగారపు ఆభరణాలు, నాలుగు కిలోల వెండితో పాటు 3 లక్షల 39 వేలకుపైగా నగదు అపహరించారు. అప్పట్లో ఈ చోరీ ఘటన ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. అదేరోజు అచ్చంపేట పోలీస్‌స్టేషన్లో క్రైమ్ నెంబరు 165/2014గా కేసు నమోదు చేశారు. ఈ కేసులో నెలలు, సంవత్సరాలు గడుస్తున్నా పురోగతి లేకపోవడంతో బాధితుడు మణికంఠ అనేకసార్లు అప్పటి గుంటూరు రూరల్ ఎస్పీని, రేంజ్ ఐజీని అనేక దఫాలు కలిసి తనకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. ఈ క్రమంలో 2022 ఫిబ్రవరి 12న గురజాలలో ఓ దుకాణంలో షాపు పైకప్పు తొలగించి 86 ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్ల చోరీ జరిగింది. ఈ చోరీపై ప్రత్యేక దృష్టి సారించిన వినుకొండ, గురజాల, శావల్యాపురం, రూరల్ సీసీఎస్ పోలీసులకు 2022 మార్చి 6న శావల్యాపురం మండలం పిచ్చుకలపాలేనికి చెందిన కలుపుకూరి బాల మునెయ్య అలియాస్ బాలమణి పట్టుబడ్డాడు. నిందితుడని పోలీసులు విచారించగా సెల్‌ఫోన్ దుకాణంలో తరహాలోనే అచ్చంపేట, బాపట్ల, విజయనగరం జిల్లా కొత్తవలస తదితర ప్రాంతాల్లోని బంగారు షాపులకు పైకప్పు తొలగించి చోరీలకు పాల్పడినట్లు అంగీకరించడంతో అరెస్టు చేశారు. దీంతో అచ్చంపేటకు చెందిన బంగారు వ్యాపారి మణికంఠను సీసీఎస్ పోలీసులు గుంటూరుకు పిలిపించి దొంగ దొరికాడని అతడి వద్ద 280 గ్రాముల బంగారం రికవరీ చేశామని, ముత్తూట్, శ్రీరామ్ ఫైనాన్స్‌లలో వెండి తాకట్టు పెట్టాడని ఆ మొత్తాన్ని రికవరీ చేసి ఇస్తామని, డబ్బు మాత్రం రికవరీ చేయలేమని చెప్పారు. అయితే దుకాణంలో 1250 గ్రాముల బంగారం చోరీకి గురైతే కేవలం 280 గ్రాములే రికవరీ చేయడం ఏమిటని వ్యాపారి మణికంఠ పోలీసుల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. అతడి ఆవేదనను పట్టించుకోకుండా మునెయ్యను అరెస్టు చేసినట్లు ప్రకటించి మీడియా ఎదుట హాజరు పరిచారు. అచ్చంపేట కో సం క ం సంబంధించి 96 గ్రాములు, బాపట్లలో ఓ షాపులో జరిగిన చోరీలో 96 గ్రాముల బంగారం, కొత్తవలసలో జరిగిన చోరీ కేసులో రెండున్నర కిలోల వెండి, గురజాల కేసులో 86 ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్లు రికవరీ చేశామని ప్రకటించారు. దీంతో అచ్చంపేటకు చెందిన వ్యాపారి షాక్‌కు గురయ్యారు. ఆభరణాలు చూసిన వ్యాపారి మరింత ఆందోళన చెందారు. అవి అత్యంత నాసిరకమైన 15 క్యారెట్ల బంగారు ఆభరణాలని, వాటిని కరిగిస్తే 40 గ్రాములకు మించి రాదని తేల్చారు. కనీసం ముందుగా చెప్పినట్లు 280 గ్రాముల బంగారం, నాలుగు కిలోలు

(మిగతా 6వ పేజీలో..)

పోలీసుల తీరుపై అనుమానాలు..

సాధారణంగా చోరీ కేసుల్లో నగదు అపహరణకు గురైతే చేతులెత్తేయడం, ఆభరణాలు చోరీకి గురైతే కక్కించడం పోలీసులకు వెన్నతో పెట్టిన విద్య. మరి ఈ కేసులో పోలీసులు వ్యవహరించిన తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. చోరీ జరిగి సంవత్సరాలు గడుస్తుంది కదా.. షాప్ యజమాని ఆశలు వదులుకుని ఉంటాడు.. ఎంత ఇచ్చినా దక్కిందే దక్కుదల అని తీసేసుకుంటాడు.. అనుకున్నారో ఏమోగానీ పోలీసులు వ్యవహరించిన తీరు మాత్రం అలాగే ఉంది. చోరీ జరిగింది కొండంత... రికవరీ చేసింది మాత్రం కొసరంత. దీనిపై అనేక అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి.

- వైసీపీ హయాంలో ఆర్టీసీలో అడ్డగోలుగా మంజూరు
- గుంటూరు, తెనాలి, పొన్నూరు, మంగళగిరి డిపోల్లో 51 మంది..
- కూటమి ప్రభుత్వం వచ్చినా ఇంకా కొనసాగుతున్న వైనం
- అక్రమ ఓడీలపై ఉన్నతాధికారులకు ఉద్యోగ సంఘ నేతల ఫిర్యాదులు

ఓడీలతో.. ఎంజాయ్



గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యం.. దీర్ఘకాలిక రోగాలతో విధులు నిర్వహించలేని పరిస్థితుల్లో ఓడీ (అవుట్ ఆఫ్ డిజిగ్నేషన్) ఇస్తారు. కానీ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్టీసీలో ఈ ఓడీలను ఇష్టం వచ్చినట్లుగా దుర్వినియోగం చేశారు. కొందరు వైసీపీ నేతల ఆదేశాలతో పలువురు ఉద్యోగులకు అధికారులు ఓడీలు ఇచ్చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పలువురు ఉద్యోగులు అక్రమ ఓడీలతో ఎంచక్కా ఎంజాయ్ చేస్తుండడంపై ఓ ఉద్యోగ సంఘ నాయకులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఆర్టీసీలో ఓడీల మంజూరుకు సంబంధిత జోనల్ కార్యాలయం అనుమతి తప్పనిసరి. అయితే ఈ నిబంధనను పట్టించుకోకుండా యథేచ్ఛగా అక్రమంగా ఓడీలు ఇచ్చేసినట్లు సమాచారం. ఇందులో అత్యధికంగా గుంటూరు-2 డిపోలో 24 మంది, గుంటూరు- 1 డిపోలో 9 మంది, తెనాలి డిపోలో ఏడుగురు, పొన్నూరు డిపోలో ఐదుగురు, మంగళగిరి డిపోలో ఆరుగురు మొత్తం 51 మంది ఉద్యోగులు తమ విధులను వదిలేసి అక్రమంగా ఓడీలు పొందుతూ ఎంచక్కా ఎంజాయ్ చేస్తున్నారని తెలిసింది. వీరంతా వారి సాధారణ విధులను వదిలేసి అందుకు భిన్నమైన తేలికపాటి విధుల్లో ఉన్నారు. కొందరైతే విధులకు రాకుండానే పూర్తిస్థాయిలో జీతాలు పొందుతున్నట్లు సమాచారం.

అర్హుల వినతులు బుట్టదాఖలు

మెడికల్ అన్‌ఫిట్ అయిన డ్రైవర్లు, కండక్టర్లు తిరిగి సాధారణ విధులు నిర్వహించలేక తీవ్ర అనారోగ్యం పాలైన వారు, హృద్రోగులు, క్యాన్సర్ రోగులు సాధారణ డ్యూటీలు చేయడంలో ఎంతో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అటువంటి బాధితులు పెద్ద ఎత్తున ఆర్టీసీలో ఉన్నారు.

(మిగతా 6వ పేజీలో..)



మిర్చియార్డుపై జరిగిన సమీక్షలో పాల్గొన్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు, అధికారులు

మిర్చియార్డులో నిలువుదోపిడీ

- 2 శాతానికి బదులు 4 శాతం కమీషన్ వసూలు
- జీరో, కటింగ్ బిజినెస్‌లతో యార్డు ఆదాయానికి గండి
- ఏటా రూ.100 కోట్లపైగా నష్టమని మంత్రికి నివేదించిన రైతు ప్రతినిధులు
- మిర్చియార్డుని నాశనం చేసిన వారిపై చర్యలు : అచ్చెన్నాయుడు

గుంటూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు మిర్చియార్డులో వైసీపీ ప్రభుత్వ హయాంలో రైతులను నిలువుదోపిడీ చేశారు. దిగుమతి వ్యాపారులు 2శాతానికి బదులు 4శాతం కమీషన్ వసూలు చేస్తున్నారు. బిల్లులు రాయకుండానే సరుకుని బయటకు తరలిస్తున్న సంఘటనలు న్నాయి. వీటి వల్ల ఏటా రూ.100కోట్లకుపైగా యార్డుకు నష్టం వాటిల్లు తుంది. ఈ అక్రమాలను అరికడితే రైతుకు మేలు జరగడంతో పాటు ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందని మంత్రి అచ్చెన్నాయుడుకు రైతు ప్రతినిధులు తెలిపారు. యార్డులో రూ.347 కోట్ల కుంభకోణం జరిగిందని విజిలెన్స్‌తో మంత్రి గురువారం గుంటూరులోని మార్కెటింగ్ కమిషనరేట్‌లో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ యార్డు నుంచి లావాదేవీలు వేరే మార్కెట్లకు తరలిపోకుండా చర్యలు చేపడతామన్నారు. మిర్చి విలువని పెంచేందుకు ఎంఎస్‌ఎంఈ పరిశ్రమల ఏర్పాటుకు ఆలోచన చేస్తామన్నారు. మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విజిలెన్స్ నివేదిక ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటివరకు జారీ చేసిన 687 కమీషన్ ఏజెంట్ల లైసెన్సులను పరిశీలించి నిబంధనల మేరకు వ్యాపారం చేయని వారిని గుర్తించి రద్దు చేస్తామన్నారు. ఈ-నామ్‌ను తప్పనిసరిగా అమలు చేస్తామని తెలిపారు. మిర్చియార్డుకు త్వరలోనే పాలకమండలి ఏర్పాటు చేస్తామన్నారు. యార్డు ప్రస్తుత అవసరాలకు సరిపోవడం లేదని వేరే చోట ఏర్పాటు చేయాలని, అవసరమైతే రూ.100 కోట్లు సమీకరించి ఇస్తామని ఎగుమతి వ్యాపారులు తెలిపగా మంత్రి సానుకూలంగా స్పందించారు. ప్రత్తిపాడులో 250 ఎకరాలకు పైగా భూమిని సేకరించి ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే రామాంజనేయులు చెప్పారు. శాసనసభ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ యార్డులోని సమస్యలను పరిష్కరించి రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించేలా కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ ఐపీ పెట్టిన కమిషన్ ఏజెంట్లు, వారికి అనుమతి మంజూరు చేసిన ఉద్యోగుల నుంచి రెవెన్యూ రికవరీ యాక్ట్ ద్వారా నగదు వసూలు చేసి రైతులకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ప్రిన్సిపల్ సెక్రెటరి బుడితి రాజశేఖర్, తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ నసీర్ అహ్మద్, పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి, యార్డు పర్సన్ ఇన్‌చార్జి భార్గవతేజ, మార్కెటింగ్ శాఖ కమిషనర్ విజయసునీత, జేడీ శ్రీనివాసరావు, విజిలెన్స్ జేడీ రాజశేఖర్, యార్డు కార్యదర్శి ఆంజనేయులు, ఏడీ రాజాబాబు, వ్యాపార సంఘాల ప్రతినిధులు అప్పిరెడ్డి, సుధాకర్, తోట రామకృష్ణ, వెలగపూడి సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు నైతిక హక్కు లేదు: అచ్చెన్నాయుడు


రైతులు గురించి మాట్లాడే నైతికహక్కు జగన్‌కు లేదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ నాశనం చేసిన వ్యవస్థని గాడిన పెడుతున్నామన్నారు. ధాన్యం కొనుగోలు చేసి 5 నెలలు చిల్లిగవ్వ చెల్లించకుండా, రూ.1600 కోట్ల అప్పు పెట్టిన దుర్మార్గుడని జగన్‌పై ధ్వజమెత్తారు. పెంగల్ తుఫానుతో తడిసిన ధాన్యం మొత్తం కొనుగోలు చేసి రైతులను ఆదుకుంటామన్నారు. అమరావతిని గాడిన పెట్టి రూ.46 వేల కోట్ల పనులను సంక్రాంతి నుంచి ప్రారంభించబోతున్నామన్నారు.

వ్యాపారం చేసేది సగం మందే

యార్డులో పేరుకు 683 మందికి కమీషన్ ఏజెంట్ లైసెన్సులున్నా వారిలో సగం మంది కూడా వ్యాపారం చేయడం లేదని మంత్రి సమీక్షలో తేలింది. రైతులు తీసుకొస్తున్న సరుకు అంతా కొన్ని దుకాణాలకే వెళుతుండటంతో సీజన్‌లో రద్దీ తలెత్తుతున్నదని, ధర కూడా పెరగడం లేదని వెలుగులోకి వచ్చింది. వేమెన్నపై కొంతమంది ఎగుమతి, దిగుమతి వ్యాపారుల ఫిర్యాదుతో వారు స్పందించి గణాంకాలతో సహా ఈ వివరాలను బయటకు తీశారు. దాంతో అంతా విస్తుబోయారు.

- నేటి నుంచి 33 రోజులు నిర్వహణ
- మండలంలో రోజుకో గ్రామంలో సభ
- ఈ సారైనా సమస్యలు పరిష్కారమయ్యేనా?

భూ సమస్యలపై సదస్సులు



(నరసరావుపేట, గుంటూరు, ఆంధ్రజ్యోతి) భూ వివాదాలతో రైతులు అల్లాడుతున్నారు. సర్వే సమస్యలతో యజమానులు సతమతమవుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీ సర్వేతో వివాదాలు, సమస్యలు మరింతగా పెరిగాయి. వాటి పరష్కారం కోసం రెవెన్యూ కార్యాలయాల చూట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం ఉండడంలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రీ సర్వేను నిలిపివేసింది. దీంతో రైతులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. రైతులు కనీసం పంట రుణాలు పొందలేని దుస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఆయా సమస్యల పరిష్కారంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. శుక్రవారం నుంచి జనవరి 8 వరకు అంటే 33 రోజుల పాటు మండల పరిధిలో రోజుకో గ్రామంలో సదస్సు నిర్వహించేలా రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు గ్రామంలోనే అధికారులు అందుబాటులో ఉండనున్నారు. మండలాల వారీగా షెడ్యూల్‌ను తహసీల్దార్లు గురువారం విడుదల చేశారు. ఏఏ గ్రామాల్లో ఏ రోజు సదస్సు జరుగుతుందో ముందుగానే తెలియజేస్తారు. సదస్సుల నిర్వహణ ఖర్చులకు ప్రభుత్వం నిధులు కూడా విడుదల చేసింది. గుంటూరు జిల్లాలో కలెక్టర్ నాగలక్ష్మి, పల్నాడులో కలెక్టర్ పీ అరుణ్‌బాబు, బాపట్లలో కలెక్టర్ వెంకటమురళి పర్యవేక్షణలో సదస్సులు జరగనున్నాయి. సంబంధిత జిల్లాల జాయింట్ కలెక్టర్ల సమన్వయంలో జరిగే సదస్సులను సబ్‌కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు నిర్వహిస్తారు. ఆర్‌ఐలు, వీఆర్వోలు, సర్వేయర్లు, దేవదాయ, వక్ఫ్ బోర్డు, అటవీశాఖ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులు సదస్సులకు హాజరు కానున్నారు. మండల స్థాయిలో సదస్సుల పర్యవేక్షణకు నోడల్ అధికారులను నియమించారు. సదస్సుల నిర్వహణపై గ్రామాల్లో ప్రచారం చేస్తారు. షెడ్యూల్‌కు అనుగుణంగా సదస్సుల్లో ఆయా గ్రామాల్లో రైతులు హాజరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోనున్నారు. కలెక్టర్, జేసీ నియోజకవర్గంలో కనీసం ఒక సదస్సుకు హాజరు కావాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు సదస్సులకు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఫిర్యాదుల స్వీకరణ.. రశీదు..

రెవెన్యూ సదస్సుల్లో భాగంగా ఆయా గ్రామాల్లో జరిగే సభల్లో బాధితుల నుంచి భూ సమస్యలపై అధికారులు దరఖాస్తులను స్వీకరిస్తారు. గ్రామస్థాయిలో భూ వివాదాలు, 22 ఏ, ఫ్రీ హోల్డ్, భూ ఆక్రమణలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరిస్తారు. దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. అనంతరం అక్కడిక క్కడే రశీదు జా రీ చేస్తారు. సమస్య తీవ్రత ఆధారంగా పరిష్కారానికి గడువు ఉంటుంది. ముందుగానే ఆ గ్రామానికి సంబంధించి రెవెన్యూ రికార్డులు అడంగళ్, 22 ఏ జాబితా, 1బీ, హౌసింగ్, అసైన్డ్ ల్యాండ్, సబ్ డివిజన్, ఎఫ్ఎంబీ, మ్యాప్‌ల సమాచారం తయారు చేసి ప్రదర్శిస్తారు. గ్రామంలోని సమాచారం సరిగ్గా ఉందో లేదో ఈ రికార్డులతో రైతులు, ఇతర ల్యాండ్ యజమానులు వారి రికార్డులతో సరిచూసుకుని ఏమైనా తేడాలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్తే గ్రామ సభలో అక్కడికక్కడే పరిష్కరించనున్నారు. గ్రామ సభ జరిగే గ్రామంలో సదస్సు జరిగే రోజు ఉచితంగా ఏపీ సేవ సర్వీసులు అందించనున్నారు. రైతులెవరికైనా సమస్యలు ఉంటే ఆ రోజు వరకు ఉచితంగా సమస్యలు పరిష్కరిస్తారు. ఈ సదస్సులు భూవివాదాలను నివారించేలా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ఆక్రమణలతో భూములు కోల్పోయిన బాధితులకు అండగా ఉండి న్యాయం చేస్తోందన్న భరోసా కల్పించేలా సదస్సులు ఉండనున్నాయి. రెవెన్యూ శాఖలో సంస్కరణలు అమలు చేసే దిశగా సదస్సులు జరగనున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో రీ సర్వే జరిగిన గ్రామాల్లో ఇటీవల రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించి అర్జీలను స్వీకరించారు. ఆయా గ్రామాల్లో వేల సంఖ్యలో అందిన అర్జీల పరిష్కారానికి నోచుకోలేదు. దీంతో రెవెన్యూ సదస్సులపై రైతుల్లో నమ్మకం సన్నగిల్లుతోంది. ఈ పరిస్థితుల్లో ఈ సారైనా తమ సమస్యలు పరిష్కారించాలని రైతులు కోరుతున్నారు. ఈ దిశగా రెవెన్యూ యంత్రాంగం స్పందించకుంటే సదస్సు లక్ష్యాలు నీరుగారిపోతాయని చెప్పవచ్చు.



చిలకలూరిపేట బైపాస్ రోడ్డు

వసూళ్ల దందా

- సైకిల్ స్టాండ్ల వద్ద దోపిడీ
- మార్కెట్ల ఆశీళ్లలో అక్రమాల బాగోతం
- చెల్లించేది గోరంత.. దోచుకునేది కొండంత
- శాఖ పరమైన కలెక్షన్ల ముసుగులో నేతల చేతివాటం

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో కార్పొరేషన్ సైకిల్ స్టాండ్ల వద్ద.. మార్కెట్లలో ఆశీళ్ల వసూళ్ల దందా సాగుతోంది. నిబంధనలను పాటించడలేదు. ఇష్టం వచ్చినట్లుగా వసూలు చేస్తున్నారు. అధికారులు పట్టించుకోకపోగా వెండర్లు రెచ్చిపోతున్నారు. వీరికి అధికార పార్టీ నేతలు సహకరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. గతంలో వైసీపీ హయాంలో ఎలాగైతే సాగిందే అదేరీతిన ఇప్పుడు కూడా జరుగుతున్న విమర్శలున్నాయి. శాఖపరమైన వసూళ్ల ముసుగులో కొందరు అధికార పార్టీ నేతలు పెద్దఎత్తున చేతివాటానికి పాల్పడుతూ నెలకు లక్షల్లో అర్జిస్తున్నారు. అధికారం మారిన వెంటనే గత పాలకుల నుంచి ప్రస్తుత పాలకులు లాగేసుకుని అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారు. చౌత్రాసెంటర్ పాల ఆస్పత్రి, పీవీకే నాయుడు మార్కెట్, కొల్లి శారదా హోల్‌సేల్ మార్కెట్, వన్‌టౌన్ మార్కెట్ సైకిల్‌స్టాండ్, పచ్చిగడ్డి మార్కెట్, గాంధీపార్క్, లాలాపేట ఫ్రూట్స్‌మార్కెట్, సంద్రీస్ మార్కెట్ల వద్ద వాహనాల పార్కింగ్ ఫీజు, ఆశీల వసూళ్లలో అక్రమాలు జరుగుతున్నాయి.

టెండర్లకు అనుమతి నై.. నేతల పాగా

నాలుగేళ్లుగా నగరంలోని జీఎంసీకి చెందిన మార్కెట్లు, వాహనాలు పార్కింగ్ ప్రాంతాలకు, సంద్రీస్ మార్కెట్‌కు టెండర్లు జరగలేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో టెండర్లు నిర్వహించగా వైసీపీ హయాంలో ఓ నాయకుడి సలహా మేరకు వీటిపై కోర్టులో కేసు వేశారు. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉందని ఇంతవరకు స్టాండింగ్ కౌన్సిల్ అనుమతి ఇవ్వలేదు. అప్పట్లో చివరి మూడేళ్లు వైసీపీ నాయకులు వసూలు చేసుకున్నారు. గడిచిన ఐదు నెలలుగా అధికార పార్టీ నేతలు వసూళ్లకు పాల్పడుతున్నారు. కొల్లి శారద మార్కెట్ వద్ద పాత గుంటూరుకు చెందిన ఓ నాయకుడు, పీవీకే నాయుడు కూరగాయల మార్కెట్‌లో మరో నాయకుడు, పాల ఆస్పత్రి వద్ద మరొకరు ఇలా అన్ని మార్కెట్ల వద్ద ఎవరిష్టం వచ్చినట్లు వారు అక్రమంగా వసూలు చేసుకుంటున్నారు. ఒక్కొక్క మార్కెట్ వద్ద ఒక్కొక్క నాయకుడు పాగా వేసి ఆశీలు ఇష్టారీతిన వసూలు చేసుకుంటున్నారు. డిపార్ట్మెంట్ కలెక్షన్ల ముసుగులో అధికార పార్టీ నేతలు సైకిల్ స్టాండ్లు, మార్కెట్ల ఆశీల వసూళ్లు చేసుకుని జేబులో వేసుకుంటున్నారు. పార్కింగ్ స్థలాల్లో వాహనదారుల నుంచి నగదు వసూలు చేస్తూ చలానాలు కూడా ఇవ్వడంలేదు. అడిగితే అక్కడి వారు దౌర్జన్యం చేస్తున్న ఘటనలు కూడా ఉన్నాయి. వాహనాల పార్కింగ్ ప్రాంతాల్లో ఎటువంటి సౌకర్యాలు లేకపోయినా వసూళ్లపై వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీఎంసీకి చెల్లించేది గోరంత కాగా దోచుకునేది కొండంతగా ఉంది. అధికార పార్టీ నేతల దోపిడీపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



మార్కెట్ వద్ద ద్విచక్ర వాహనాల స్టాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

జగన్ పశ్చాత్తాప యాత్ర చేస్తే బాగుంటుంది

- ఏపీ దోపిడీ దొంగ ఎవరంటే జగన్ పేరు మోత మోగుతుంది
- ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఎద్దేవా

గుంటూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్ 'పోరుబాట'కు బదులు 'పశ్చాత్తాప' యాత్ర, 'క్షమాపణ' యాత్ర మోకాళ్లపై చేస్తే బాగుంటుందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఎద్దేవా చేశారు. గుంటూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంజనేయులు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి 'పోరుబాట'కు పిలుపు నివ్వడం చాలా హాస్యాస్పదంగా ఉందన్నారు. పోరుబాట పేరుతో జగన్ శాంతిభద్రతలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. విద్యుత్ చార్జీల పెంపుపై పోరుబాట అంటున్న జగన్ తన హయాంలో విద్యుత్ చార్జీలు 8 సార్లు ఎందుకు పెంచారో, వ్యవసాయ రంగానికి రూ.10 వేల కోట్లు బకాయిలు ఎందుకు పెట్టారో చెప్పాలని ప్రశ్నించారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌కు జగన్ ఉరి శిక్ష వేశారని అన్నారు. యువతను గంజాయి మత్తుకు బానిసలు చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో రూ.3,500 కోట్ల ఫీజ్ చెల్లించకపోవడంతో విద్యార్థుల సర్టిఫికెట్లు కాలేజీలో నిలిచిపోయాయని గుర్తుచేశారు. ఫీజు రీయంబర్స్ మెంట్ గురించి మాట్లాడే అర్హత జగన్‌కు లేదని, రాష్ట్రంలో విద్యార్థులను రోడ్డున పడేసింది జగనేనని విమర్శించారు. రాష్ట్రంలో ప్రజలు జగన్‌కి ఒక్కసారి అవకాశమిస్తే యువతకు ఉపాధి లేకుండా చేశారని, నేడు యువత ఉద్యోగాలు లేక అల్లాడి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పోరుబాట పెట్టినా ప్రజలు జగన్‌ను క్షమించరని అన్నారు. ధాన్యానికి జగన్ పెట్టిన రూ.1600 కోట్ల బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించిందని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వంలో చేసిన మోసాలు కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్కొక్కటీగా వెలుగులోకి వస్తున్నా యన్నారు. జగన్ ఓడిపోయిన తర్వాత ఆత్మపరిశీలన చేసుకోక పోగా దుర్మార్గపు ఆలోచనలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర బ్రాండ్ ఇమేజీని దెబ్బతీయాలని, రాష్ట్రానికి పరిశ్రమలు రాకుండా చేయాలని జగన్ కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీ దోపిడీ దొంగ ఎవరని ప్రశ్నిస్తే జగన్ పేరు మోత మోగుతుందని ఎద్దేవా చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రూ. 4 వేలకు పెంచి లబ్దిదారులకు అందిస్తున్నామన్నారు. 2047 నాటికి స్వర్ణాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దు తామని చెప్పారు. సమావేశంలో ఏపీ నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, వేముల కొండ శ్రీనివాస్, బొబ్బిలి రామారావు, దామచర్ల శ్రీనివాసరావు, కే.ఎం.ఈ హసైన్, మన్నవ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

- రాష్ట్ర వ్యాప్తంగా రేపు మెగా పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లు ప్రారంభం
- బాపట్లలో కార్యక్రమానికి హాజరుకానున్న సీఎం
- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు

బాపట్లరూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 7న మెగాపేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లు ప్రారంభం కానున్నాయి. బాపట్లలోని మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలు, సభావేదిక ఏర్పా ట్లను రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, మంత్రులు గొట్టిపాటి రవి, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఎం.ఎం.కొండయ్య, ఏలూరి సాంబశివరావు గురువారం పరిశీలించారు. మెగా విద్యార్థుల పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌కు హాజరయ్యేందుకు వస్తున్నందున పాఠశాల తరగతి గదులు విద్యార్థుల తల్లులకు నిర్వహించే రంగవల్లులు, తండ్రులకు నిర్వహించే టగ్గాఫ్ వార్ పోటీల నిర్వాహణ, ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జి.వెంకటమురళి అడిగి తెలుసుకున్నారు. వర్షం వస్తే కార్యక్రమానికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలని, సభావేదిక, ప్రాంగణం ఏర్పాట్లను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలో 919 మంది విద్యార్థులు నమోదు కాగా ప్రస్తుతం 818 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని మంత్రులకు కలెక్టర్ వివరించారు. తరగతి గదుల విశాలంగా లేకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి ఇబ్బందులు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, పీఏ సిస్టమ్ నడిపించడంలో అవాంతరాలు రాకుండా చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి మంత్రి ఆదేశించారు. మీడియా పాస్‌లివ్వడంలో సమస్యలు రాకుండా చూడాలన్నారు. అనంతరం విలేకరులతో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ బాపట్లలో నిర్వహించే రాష్ట్ర స్థాయి కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, విద్యాశాఖ హెచ్ఆర్‌డీ మంత్రి నారా లోకేష్ హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. పాఠశాల అభివృద్ధి, పిల్లల చదువులు, వ్యక్తిత్వ వికాసం పెంపొందించటానికే రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు. విద్యార్థులు నిర్లిప్తంగా ఉంటే అందుకు కారణాలు, వారిలో అసంతృప్తి, ఏయే సబ్జెక్టులలో బలహీనంగా ఉన్నారో గుర్తించి వారిని సరైన మార్గాలలోకి తెచ్చేలా తల్లిదండ్రులతో చర్చించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యార్థులలో క్రమశిక్షణ నేర్పేలా తల్లిదండ్రులకు వ్యక్తిగత క్రమశిక్షణ అలవర్చడం, వారి నుంచి సూచనలు, సలహాలు తీసుకుంటామన్నారు. ఎన్‌సీఆర్‌టీ నిబంధనల ప్రకా రం పాఠశాలలో విద్యాబోధన జరుగుతుందో లేదో క్షేత్ర స్థాయిలో పరిశీలించి విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని తెలిపారు. పాఠశాలలో ఉపాధ్యాయుల నియామకం, సరైనవిధానంలో విద్యాబోధన సాగుతుందో లేదో తెలుసుకుంటామన్నారు. పూర్వవిద్యార్థులను గుర్తించి ఆహ్వానించడం, అభినందించటం ద్వారా వారిని ప్రోత్సహించినట్లు అవుతుందన్నారు. రాజకీయపార్టీల ప్రమేయం లేకుండా సాదాసీదాగా ఈ కార్యక్రమం నిర్వహించటానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. 2014నుంచి 2019 వరకు బాపట్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల ఫలితాలు 90 శాతం పైగా ఉన్నాయని వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కరోన తర్వాత ఫలితాలు 29 శాతానికి పడిపోయాయన్నారు. కూటమి ప్రభుత్వంలో నిబంధనల మేరకు ఉపాధ్యాయులను నియమించడం, విద్యాబోధనపై దృష్టి సారించడం ద్వారా విద్యార్థులు మంచి ఫలితాలు సాధిస్తారని, ప్రభుత్వ ముఖ్య ఉద్దేశ్యమని ఇదేనని మంత్రి వివరించారు. కార్యక్రమంలో కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడి, సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్, బుడా చైర్మన్ రాజశేఖర్‌బాబు, మాజీ శాసన సభ్యుడు చీరాల గోవర్దనరెడ్డి పాల్గొన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి, మంత్రులు గొట్టిపాటి రవి, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు వేగేశన నరేంద్రవర్మ, ఎం.ఎం.కొండయ్య, ఏలూరి సాంబశివరావు

విస్తృత ఏర్పాట్లు

మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పాఠశాల అధికారుల ఆధీనంలోకి వెళ్ళిపోయింది. మున్సిపల్ హైస్కూల్‌తోపాటు చుట్టుపక్కల ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను కూడా ఆధునీకరిస్తున్నారు. అధికారులు, నాయకులు కలిసి పాఠశాలను సందర్శించారు. మెగా పేరెంట్స్ అండ్ టీచర్స్ మీటింగ్‌కు వచ్చే ముఖ్యమంత్రి ఏ కార్యాలయాన్ని సందర్శిస్తారోనని అందరు సిద్ధమవుతున్నారు. కలెక్టర్ జె.వెంకటమురళి, ఎస్పీ తుషార్‌డూడి, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితర అధికారులు, నాయకులు పాఠశాలను తరుచుగా సందర్శిస్తున్నారు. విద్యాశాఖ చీఫ్ సెక్రటరి కోన శశిధర్ ఆదేశాల మేరకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులకు నిర్వహించే పోటీలకు సంబంధించిన ఏర్పాట్లను ప్రత్యేకంగా చేశారు. సభావేదిక ప్రాంగణాన్ని అలంకరిస్తున్నారు. ఏర్పాట్లను పరిశీలించిన వారిలో ఆర్డీవో పి.గ్లోరియా, మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, మహిళా శిశు సంక్షేమశాఖ పీడీ కె.ఉమా, జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం, జిల్లా క్రీడాధికారి పాల్‌కుమార్ ఉన్నారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు మెగా పేరెంట్స్ - టీచర్స్ మీట్

- మీడియా సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి పేర్కొన్నారు. కలెక్టరేట్ లోని డీఆర్సీ సమావేశ మందిరంలో మెగా పేరెంట్స్ - టీచర్స్ మీట్‌పై గురువారం పాత్రికేయుల సమావేశం నిర్వ హించారు. అంతకుముందు ఈ కార్యక్రమం నిర్వహణపై రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్‌జీవోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచే లక్ష్యంతో ఈ నెల 7 నుంచి మెగా పేరెంట్స్ - టీచర్స్ మీట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక విద్యార్థి పాఠశాలలో ఎలా చదువుతున్నాడు, అక్కడ టీచర్లు ఎలా చూస్తున్నారు, విద్యార్థి ఏ విధంగా మెరుగవుతున్నాడో వారి తల్లితండ్రులకు తెలియజేయడానికి ప్రోగ్రెస్ కార్డుల స్థానంలో వినూత్నంగా రూపొందించిన హోలీస్టిక్ ప్రోగ్రాం కార్డులతో వివరించడం జరుగుతుందన్నారు. ఈ కార్డు ప్రతి పిల్లవాడికి ఏడవ తేదీ ఉదయం తరగతి గదిలో ఇస్తారని తెలిపారు. పేరెంట్స్ వచ్చి స్కూల్ వాతావరణం, అక్కడ వుండే సౌకర్యాలు, ఉపాధ్యాయులు ఎలా బోధిస్తున్నారు వంటి విషయాలను స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ వారు తెలియజేస్తారన్నారు.



రాజకీయ పార్టీలు, ఎన్‌జీవోల ప్రతినిధులతో సమావేశమైన కలెక్టర్

ప్రజా ప్రతినిధులు, దాతలు, ఓల్డ్ స్టూడెంట్స్ కూడా ఈ కార్యక్రమంలో పాలు పంచుకుంటారన్నారు. జిల్లాలోని 1064 హై స్కూల్స్ ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ స్కూల్స్ మెగా పేరెంట్స్ మీట్ నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, జాయింట్ కలెక్టర్ ఏ భార్గవ తేజ, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా జిల్లా రెవెన్యూ అధికారి షేక్. ఖాజావలి, జిల్లా విద్యా శాఖాధికారిణి సీవీ రేణుక పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



మృతి చెందిన గుర్రం కోటేశ్వరరావు

కర్లపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యాజలి పంచాయతీ సమీపంలో రైతు ఉత్పత్తిదారుల సేవాసంఘం ఎదురు రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్న సం ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. ఎస్సై రవీంద్ర కథనం ప్రకారం మండలంలోని బొలయపాలెంకు చెందిన గుర్రం కోటేశ్వరరావు చందోలు నుంచి యాజలి వైపు వస్తుండగా యాజలికి చెందిన నందిపాటి శ్రీరామ్ సునీల్ ఎదురుగా వస్తున్న వాహనం ఢీ కొనడంతో కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన శ్రీరామ్ సునీల్‌ను బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు పంపారు. కోటేశ్వరరావు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. కోటేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇరువురికి వివాహమైంది.

ప్రేమ పేరిట మోసం.. ఏఎన్‌యూ గెస్ట్ ఫ్యాకల్టీపై కేసు

పెదకాకాని, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి చెందిన ఓ గెస్ట్ ఫ్యాకల్టీ ఓ విద్యార్థినిని ప్రేమి స్తున్నానంటూ వెంటపడి, పెళ్లి చేసుకుంటానని నమ్మ బలికి, అవసరం తీరాక మొహం చాటేస్తున్న ఘటనపై పెదకాకాని పోలీసులు కేసు నమోదు చేశారు.పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. పెదకాకాని మండలం నంబూరుకి చెందిన కోడూరు పృథ్వీరాజ్ ఆచార్య నాగార్జున విశ్వవిద్యా లయంలో ఇంజనీరింగ్ విభాగంలో గెస్ట్ ఫ్యాకల్టీగా ఉద్యోగం చేస్తున్నాడు. నెల రోజుల క్రితం అతనికి ఈ ఉద్యోగం లభించింది. ఈ విశ్వవిద్యాలయంలోనే ఓ విద్యార్థిని ఎంటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోంది. పృథ్వీరాజ్, ఆ విద్యార్థిని మధ్య 2020 నుంచి స్నేహం ఏర్పడింది. స్నేహం కాస్త ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి ఆమెను శారీరకంగా లొంగదీసుకున్నాడు. పెళ్లి చేసుకోమని ఆ విద్యార్థిని ఒత్తిడి చేయడంతో బుకాయించాడు. దీంతో, బాధితురాలు నేరుగా పెదకాకాని పోలీసులకు ఫిర్యాదు తెలియజేసింది. ఈ మేరకు గెస్ట్ ఫ్యాకల్టీ పృథ్వీరాజ్ పై పెదకాకాని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న విజ్ఞాన్ వీసీ నాగభూషణ్, యలమంచిలి శ్రీనివాసరావు తదితరులు

విజ్ఞాన్స్ వర్సిటీ, థెరలైన్ ఫార్మాల అవగాహన ఒప్పందం

- ప్రాక్టికల్ ఇండస్ట్రీ అనుభవం అందిస్తాం
- వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ నాగభూషణ్

గుంటూరు(విద్య),డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ, హైదరాబాద్‌లోని థెరలైన్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని బుధవారం వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో థెరలైన్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో, మేనేజింగ్ డైరక్టర్ యలమంచిలి శ్రీనివాసరావుతో యూనివర్సిటీ డీన్ పీసీఎఫ్ డాక్టర్ దిరిశాల విజయరాము అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారని తెలియజేశారు. వర్సిటీ వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ ఇంటర్న్‌షిప్ అవకాశాలను అందించడం, ప్రాక్టికల్ ఇండస్ట్రీ అనుభవాన్ని అందించడంతో పాటు వృత్తిపరమైన వృద్ధిని పెంపొందిస్తామన్నారు. హైదరాబాద్‌లోని థెరలైన్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ యలమంచిలి శ్రీనివాసరావు మాట్లాడుతూ అధ్యాపకులను, విద్యార్థులను సరికొత్త టెక్నాలజీల వైపు ప్రోత్సహించడంతో పాటు వారికి ఆయా రంగాలలో తర్ఫీదు ఇవ్వడమే ఈ ఒప్పందం లక్ష్యం అని అన్నారు. ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ శాస్త్రవేత్త పంకజ్‌కు సీఐఐ అవార్డు



కేంద్ర మంత్రి భూపేందర్ యాదవ్ నుంచి అవార్డు అందుకుంటున్న డాక్టర్ పంకజ్

మంగళగిరి సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఏపీ ఎస్ఆర్ఎం యూనివర్సిటీకి చెందిన పర్యావరణ శాస్త్రవేత్త, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పంకజ్ పాఠక్‌కు 2024 సంవత్సరానికి గాను ప్రతిష్టాత్మక సీఐఐ 4ఆర్ అవార్డు లభించింది. కేంద్ర పరిశోధనా రంగ సహకారంతో భారతీయ వాణిజ్య మండలి (సీఐఐ) ఇటీవల న్యూఢిల్లీలో వ్యర్థాల నుంచి సంపద సృష్టించే సాంకేతికతపై 9వ అంతర్జాతీయ సదస్సు నిర్వహించింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర అటవీ, పర్యావరణ శాఖా మంత్రి భూపేందర్ యాదవ్ శాస్త్రవేత్తల సేవలను కొనియాడుతూ అవార్డులను ప్రదానం చేశారు. ప్రొఫెసర్ పంకజ్ పాఠక్ గడిచిన ఆరేళ్లుగా పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల సమగ్ర నిర్వహణపై పరిశోధనలు చేస్తున్నారు. ఎక్స్‌ట్స్ ఇన్ ఇన్నోవేషన్ సొల్యూషన్స్‌పై ఆమె తయారు చేసిన పత్రాలను పరిశీలించిన సీఐఐ కేంద్ర కార్యాలయం 2024 వార్షిక సంవత్సరానికి డాక్టర్ పంకజ్‌ను పరిశోధన, విద్యా సంస్థల కేటగిరీలో అవార్డుకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా డాక్టర్ పంకజ్‌కు ఎస్ఆర్ఎం అధ్యక్షుడు డాక్టర్ పీ.సత్యనారాయణన్, వీసీ ఆచార్య మనోజ్‌కుమార్ అరోరా, రిజిస్ట్రార్ డాక్టర్ ప్రేమ్ కుమార్‌లు అభినందనలు తెలిపారు.

జాతీయ రహదారులుగా అభివృద్ధి చేయాలని వినతి



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి వినతిపత్రం అందించి వివరిస్తున్న బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల,డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు రోడ్లను జాతీయ రహదార్లుగా అభివృద్ధి చేయాలని కోరుతూ బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ గురువారం న్యూఢిల్లీలో కేంద్ర రోడ్డు రవాణా, రహదార్ల శాఖా మంత్రి నితిన్ గడ్కరీని వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గంలో హైవే రోడ్డు అభివృద్ధి చేయాలని కోరారు. నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్ నుంచి అమరావతి ఓఆర్ఆర్‌కి ప్రత్యేక కనెక్టివిటి, మచిలీపట్నం ఓడరేవు, నిజాంపట్నం ఫిషింగ్ హార్బర్, చీరాల ఓడరేవు, చీమకుర్తి గ్రానైట్ పరిశ్రమలు, ఒంగోలు సమీపంలోని ఎన్‌హెచ్ 16కు కలుపుతూ ఎన్‌హెచ్ 216ను 4లైన్‌ల రోడ్డుగా అభివృద్ధి చేయాలని వివరించారు.

అమరేశ్వరునికి కార్తీకమాస ఆదాయం రూ.1.8 కోట్లు



హుండీలో కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

అమరావతి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో అమరేశ్వరుని దర్శించిన భక్తుల నుంచి వివిధ రూపాలలో రూ.1,83,74,220 ఆదాయం లభించినట్లు దేవస్థాన సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి పీ సునీల్ కుమార్ తెలిపారు. గురువారం జరిగిన హుండీల లెక్కింపులో రూ.57,10,061, ప్రత్యేక దర్శనాలతో రూ. 52,83, 400, ప్రత్యక్ష అభిషేకంతో రూ17,05,800, పరోక్ష అభిషేకంతో రూ14,06,160, లడ్డు ప్రసాదంతో రూ22,64,400, పులి హోర ప్రసాదంతో రూ20,310, అన్నదాన విరాళం రూ13,71,304, లక్షబిల్వార్చనతో 3,51,364, విరాళాలు, ఇతర సేవలతో రూ.2,61,421 ఆదాయం లభించినట్లు వివరించారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో సేవా సంస్థల సభ్యులు పాల్గొన్నారు.

ఓడీలతో.. ఎంజాయ్

(5 పేజీ తరువాయి)

తమ పరిస్థితిని చూసి మానవత్వంతో ఓడీలు కల్పించాలని చేసిన విజ్ఞప్తులను కొందరు డిపో మేనేజర్లు బుట్టదాఖలు చేస్తున్నారన్న విమర్శలున్నాయి. అవయువాలన్నీ బాగున్న వారికి, ఎలాంటి అనారోగ్య సమస్యలు లేని వారికి మాత్రం వైసీపీ హయాంలో ఓడీలు కల్పించడంపై విమర్శలు వస్తున్నాయి. ఆయా డిపోల్లో డిపో మేనేజర్లకు వత్తాసు పలికే 'కట్టప్ప'లకు, వైసీపీ విధేయులకు మాత్రం అడ్డగోలుగా ఓడీలు కల్పించేశారన్న ఆరోపణలున్నాయి.

అక్రమ ఓడీలపై నోరెత్తని నాయకులు..

అక్రమ ఓడీలతో ఎంజాయ్ చేస్తోన్న కొందరు యూనియన్ నాయకులు సంస్థలో సిబ్బంది పడుతోన్న సమస్యలను ప్రశ్నించకుండా మిన్నకుండిపోతున్నారన్న విమర్శలున్నాయి. డిపోల్లో సమస్యలైన టాయిలెట్స్, తాగునీరు, రెస్ట్ రూమ్స్, రన్నింగ్ టైం సమస్యలు, బస్సుల కండిషన్‌లాంటి సమస్యలు అడిగే నాథుడే కరువయ్యారు. కేవలం కొద్ది మంది మెప్పుకోసం వైసీపీ హయాంలో విచ్చలవిడిగా చేసిన అక్రమ ఓడీల వ్యవహారంపై ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి విచారణ జరపాలని ఉద్యోగులు కోరుతున్నారు.

అసభ్యకర పోస్టులు పెట్టిన వైసీపీ వలంటీర్‌పై కేసు నమోదు

అమరావతి, డిసెంబరు 5:(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, జనసేన నాయకులు నాగబాబుపై అసభ్యకరపోస్టులు పెట్టిన అమరావతి రాజీవ్‌కాలనీకి చెందిన వైసీపీ వలంటీర్ కంభంపాటి శంకర్ కుమారుడు దినేష్‌పై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఇదే కాలనీకి చెందిన జనసేన అభిమాని లాం వంశీ, తమ నాయకులపై దినేష్ మూడు నెలలుగా అసభ్యకరపోస్టులు పెడుతున్నాడని ఆధారాలతో పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. వంశీ ఫిర్యా దు మేరకు ఎస్‌హెచ్‌ఓ ఎం శ్రీనివాసరావు దినేష్‌పై 351(2), 352,353(1) సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు.

రికవరీలో.. గోల్‌మాల్?

(5 పేజీ తరువాయి)

వెండి కూడా ఇవ్వకుండా కేవలం 96 గ్రాములు రికవరీ చూపడం ఏమిటని వాపోయారు.

రూ.8 లక్షల ఖర్చు..

దుకాణంలో చోరీ జరిగిన బంగారం కోసం ఇప్పటివరకు వ్యాపారి మణికంఠ ఎనిమిదేళ్లు తిరిగారు. రూ.8 లక్షలకు పైగా ఖర్చు చేశారని సమాచారం. అయితే పోలీసులు చూపుతున్న 96 గ్రాముల నాసిరకం బంగారం తీసుకుంటే కనీసం తాను ఖర్చు పెట్టిన డబ్బులు కూడా రావని వాపోతున్నారు. ఈ బంగారాన్ని తీసుకోవాలని ఏడాదిగా పోలీసులు ఒత్తిడి తెస్తుండగా అతను ససేమిరా అంటున్నారు. ఇప్పుడు ఆ ఆభరణాలను తీసుకుంటే ఇంకా కొంతమంది చేతులు తడపాల్సి ఉంటుందని, దీంతో ఆ మొత్తం అందుకే సరిపోతుందని మణికంఠ భయపడుతున్నారు.

పట్టించుకోని పోలీసు ఉన్నతాధికారులు

అచ్చంపేట భారీ కేసులో దొంగ దొరికినా పోలీసులు కేవలం 96 గ్రాములు అదీ నాసిరకం బంగారాన్ని మాత్రమే రికవరీ చూపిన ఘటనపై పోలీసు ఉన్నతాధికారులు కూడా స్పందించకపోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సాధారణంగా చోరీ కేసుల్లో బంగారం రికవరీలో 10 గ్రాములో.. 20 గ్రాములో రికవరీలో తేడా ఉన్నా పెద్దగా ఆలోచించాల్సిన పనిలేదు. కానీ కిలోకి పైగా బంగారు ఆభరణాలు చోరీకి గురైతే కేవలం 96 గ్రాముల నాసిరకం బంగారు ఆభరణాలు చూపడం ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. ఆ 96 గ్రాముల బంగా రాన్ని తీసుకునేందుకు బాధితుడు ముందుకు రాకపోయినా ఉన్నతాధి కారుల్లో స్పందన లేకపోవడం మరింత ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. రెండేళ్లుగా పోలీసులు ఆ బంగారం తీసుకెళ్లాలని, లేదంటే తామే కోర్టుకు లెటర్ పెట్టి బాక్స్‌లో వేస్తా మని వ్యాపారిపై ఒత్తిడి తెస్తున్నారు. లేదంటే బంగారం తీసుకున్నట్లుగా లెటర్‌పై సంతకం చేస్తే చాలని దాన్ని తాము ప్రజోపయోగ కార్యక్రమా లకు వినియోగిస్తామని గతంలో కొందరు పోలీస్ అధికారులు మణికంఠను ప్రలోభ పెట్టడం గమనార్హం.



అప్పట్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

సమగ్ర విచారణతోనే వాస్తవాలు వెలుగులోకి..

అచ్చంపేట, బాపట్ల, కొత్తవలస దుకాణాల్లో జరిగిన చోరీ కేసులు అన్నింటిపైనా పోలీసు అధికారులు సమగ్ర విచారణ జరిపిస్తే వాస్తవాలు వెలుగు చూసే అవకాశం ఉంది. అచ్చంపేటకు చెందిన వ్యాపారిని గుంటూరుకు పోలీసులు పిలిపించిన సమయంలో 280 గ్రాములు ఇస్తామని చెప్పారు. అయితే ఆ తర్వాత అచ్చంపేట, బాపట్ల దుకాణాల్లో జరిగిన చోరీలకు సంబంధించి రికవరీ చేసిన బంగారమంతా కూడా 192 గ్రాములే ఉండడం గమనార్హం. ముందుగా చెప్పిన 280 గ్రాములు ఏమైనట్లు అనేది కూడా మరో ప్రశ్నగా ఉంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.20 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	96.104.115
చికెన్ విత్ స్కిన్	184.00
చికెన్ స్కిన్ లెస్	194.00

52,275 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 49,078 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 52,275 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 38,121 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	15000	334	7700	14500
నెంబరు. 5	8000	13000	నెంబరు.5	8000	14000
273	10000	15000	273	8000	11000
341	7700	13400	341	8000	13000
4884	11500	12500	4884	8000	14000
సూపర్ 10	9500	9500	సూపర్ 10	9800	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	16300	తేజ	7500	16500
బ్యాడిగి	8000	13000	బ్యాడిగి	8000	14000
దేవనూరు డీలక్స్	9000	13700	దేవనూరు డీలక్స్	9000	12500
తెల్లకాయలు	4000	11500	తెల్లకాయలు	4000	10000

దాడులను ఖండించిన బీజేపీ

గుంటూరు సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను బీజేపీ గుంటూరు జిల్లా నేతలు గురువారం ఖండించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయ ప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ఇస్కాన్‌కు చెందిన ముగ్గురుపై అక్కడి ప్రభుత్వం తప్పుడు అభియోగాలు మోపి జైలులో ఉంచిందన్నారు. వారి తరఫున వాదించేందుకు ముందుకు వస్తున్న న్యాయవాదులపై కూడా దాడులకు తెగబడ్డారని వివరించారు. అక్కడి జనాభాలో 8 శాతంగా ఉన్న హిందువులు భయంతో కాలం వెళ్లదీస్తున్నారని అన్నారు. 1971లో బంగ్లాదేశ్ ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే ఇస్కాన్ వ్యవస్థాపకుడు శీలం ప్రభుదాస్ 2.5 మిలియన్ డాలర్లను సేకరించి ఇవ్వడమే కాకుండా, అక్కడ ఉన్న ఎంతోమంది బాధితులకు సేవ చేయించారని అన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యాన్నిస్వాధీనం చేసుకున్న సివిల్ సప్లైఅధికారులు

తాడికొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లాం గ్రామంలో 5.75 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే, గ్రాంలోని జహీద్ బాషాకు చెందిన ఖాళీ స్థలంలో రేషన్ బియ్యం ఉన్నట్లు స్థానికుల సమాచారం మేరకు సివిల్ సప్లై డీటీ దేవ రాజ్, రెవె న్యూ అధికారులతో కలసి తనిఖీలు నిర్వహించారు. 13 బస్తాల్లో రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించి, ఆ బియ్యాన్ని స్థానిక డీలర్‌కు స్వాధీనం చేసి, జహీద్ బాషాపై 6ఏ కేసు నమోదు చేశారు. తనిఖీలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్వో ఉన్నారు.

ఉపాధి హామీ పనులను సక్రమంగా నిర్వహించాలి

● డ్వామా పీడీ శంకర్

మేడికొండూరు డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులను సక్రమంగా నిర్వహించాలని డ్వామా పీడీ శంకర్ తెలిపారు. ఉపాధిహామీ పథకంపై సామాజిక తనిఖీలో భాగంగా గురువారం మేడికొండూరులో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో కొన్ని చోట్ల కొబ్బరి చెట్లు నాటినట్టు చూపారని, డీఆర్‌సీ బృందం తనిఖీలో ఆయా ప్రాంతాల్లో కొబ్బరిచెట్లకు బదులు వేరే మొక్కలున్నాయని అన్నారు. అంతేగాకుండా కూలీలకు రశీదులు కూడా ఇవ్వడం లేదన్నారు. కూలీలకు జాబ్‌కార్డులు సక్రమంగా పంపిణీ చేయడం లేదని, అప్‌డేట్‌లు కూడా ఉండటం లేదని తెలిపారు. కూలీ పంపిణీ చేసిన వారి సంతకాలు కూడా లేవని పేర్కొన్నారు. గృహ నిర్మాణ పథకంలో భాగంగా ఉపాధి హామీ పథకం కింద నిర్మించాల్సిన మరుగుదొడ్లను కొన్ని గ్రామాల్లో నిర్మించకుండానే బిల్లులు చెల్లించినట్టు తమ దృష్టికి వచ్చిందని వివరించారు. ఇటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తోట చందన, ఏపీడీ శివన్నారాయణ, విజిలెన్స్ డీఈ హనుమంతరావు, ఏపీవో కిరణ్మయి, ఈసీ లక్ష్మిపతి, ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, జడ్పీటీసీ సభ్యులు సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు, పారిశ్రామిక వేత్త కారుమంచి ప్రసాద్‌బాబు

8న కాకుమానుకు కేంద్రమంత్రి రాక

కాకుమాను, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు కాకుమానుకు వస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు నువ్వుల సునీల్ చౌదరి తెలిపారు. కాకుమాను శివారులో ప్రసాద్ సీడ్స్ అధినేత కారుమంచి ప్రసాద్‌బాబు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నిర్మించిన కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొం టారని అన్నారు. అలాగే అగ్రికల్చర్ టెక్నాలజీ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసే స్థలాన్ని గురువారం టీడీపీ నాయకులు రాంగోపాల్, పూర్ణచంద్రరావులతో కలసి సందర్శించారు. ఈ కేంద్రంలో అదునాతన యంత్రాలు, డ్రోన్ల తయారీ తదితరాలు జరుగుతాయని ప్రసాద్ సీడ్స్ అధినేత ప్రసాద్ బాబు తెలిపారు.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఎంపీ పెమ్మసాని సమావేశం రేపు

మేడికొండూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కేంద్ర మంత్రి, గుంటూరు పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మేడికొండూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో భారీ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల నాయకులు గురువారం తెలిపారు. విద్యార్థుల సమస్యలతో పాటు, పాఠశాలల స్థితిగతులపై తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలసి ఆయన సమీక్షించనున్నారని, ఈ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన వలసిందిగా టీడీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు.

శివారు ప్రాంతాలపై చిన్నచూపు!

● తొలగించని నిర్మాణ శిథిలాలు

● నిలిచిపోయిన మురుగు, వ్యర్థాలు

● పట్టించుకోని జీఎంసీ హెల్త్ ఆఫీసర్లు

గుంటూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర కార్పొరేషన్ పరిధిలోని శివారు ప్రాంతాలను కార్పొరేషన్ అధికారులు చిన్నచూపు చూస్తున్నట్లుగా కనిపిస్తోంది. కోట్లాది రూపాయలు పన్నులు కడుతున్న అక్కడి ప్రజల సమస్యలను ఏమాత్రం పట్టించుకోకపోగా, వారికి జీఎంసీనే కొత్త సమస్యలు సృష్టిస్తుండటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. తమ సమస్యలను అధికారులకు చెప్పినా పట్టించుకోకపోవడంతో వారంతా రోడ్డెక్కే పరిస్థితి ఏర్పడింది.

గుంటూరు నగరంలోని 46వ డివిజన్ అమరావతి రోడ్డు నగరాలులో జీఎంసీ అధి కారులు ఇటీవల డ్రెయిన్ల నిర్మాణం చేపట్టారు. అందుకోసం అంతకు ముందున్న డ్రెయిన్‌లను పగులగొట్టారు. వాటి స్థానంలో కొత్త డ్రెయిన్లు నిర్మిం చారు. అంతటితో తమ పనైపోయిందని వదిలేశారు. డ్రెయిన్లను నిర్మించే క్రమంలో డ్రైనేజీలో పడిన రాళ్లు, గత నిర్మాణపు శిథిలాలు, నిర్మాణానికి వినియోగించిన ఇనుప చువ్వలను అలాగే వది లేయడంతో అవి మురుగునీటి పారుదలకు ఆటంకంగా మారిపోయాయి. దీంతో, డ్రైనేజీ నీటిలో కొట్టుకువచ్చిన వ్యర్థాలన్నీ అక్కడే ఆగిపోయి మురుగునీరు పైకి వస్తోంది. దీనిపై స్థానిక ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోవడం లేదు. టీడీపీ కార్పొరేటర్ నూకవరపు బాలాజీ జీఎంసీ హెల్త్ ఆఫీసర్ల దృష్టికి సమస్యను తీసుకువెళ్లినా పరి ష్కారం మాత్రం దొరకలేదు. పారిశుధ్య నిర్వహణ అధికారులైన ఎంహెచ్‌వోలు ఇద్దరు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ 15 రోజులగా ఆ సమస్యను అలానే వది లేశారు. దీంతో సమస్య రచ్చకెక్కింది. ఇప్పటికైనా జీఎంసీ కమిషనర్, అధికారులు స్పందించి చర్యలు చేపట్టక పోతే ప్రజలు రోడ్డెక్కే ప్రమాదం వుంది.



నగరాలులోని డ్రైనేజీలో నిలిచిపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు



నిర్మాణం పూర్తయ్యాక అలానే వదిలేసిన ఇనుప చువ్వలు, కాలువలోని మట్టి దిబ్బ



డ్రైనేజీలో పడిపోయిన నాపరాయి ముక్కలు, రాళ్లు



గోరంట్ల కొండ వద్ద రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసుల

రిజర్వాయర్ పనులు గడువులోగా పూర్తి చేయాలి

● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలోని విలీన గ్రామాల ప్రజలకు తాగునీటిని అందించడానికి ప్రతిపాదించిన గోరంట్ల కొండమీద రిజర్వాయర్ పనులు అత్యవసరమని, అగ్రిమెంట్ మేరకు పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయని కాంట్రాక్టర్‌కి నోటీసు ఇవ్వాలని ఇంజినీరింగ్ అధికారులను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం కమిషనర్ గోరంట్ల కొండమీద రిజర్వాయర్ పనులు, తక్కెళ్లపాడులో పంపింగ్ లైన్ మీద ఏర్పడిన లీకును పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గోరంట్ల కొండమీద రిజర్వాయర్ నిర్మాణం వలన చుట్టు పక్కల పలు ప్రాంతాలకు తాగునీటి కొరతని తీర్చడానికి వీలు కలుగుతుందన్నారు. అంతటి ప్రాధాన్యత కలిగిన రిజర్వాయర్ పనులు ఇప్పటికే తీవ్ర జాప్యం జరిగాయని, ఇక నుంచి అలా జరగడానికి వీలు లేదని స్పష్టం చేశారు. రిజర్వాయర్ నిర్మాణ పనులను టెండర్ అగ్రిమెంట్ మేరకు నిర్దేశిత గడువులోగా పూర్తి చేయని కాంట్రాక్టర్‌కి నోటీసులు ఇవ్వాలని, తదుపరి స్పందన మేరకు చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. అనంతరం తక్కెళ్లపాడు గ్రామంలో గుంటూరు హెడ్ వాటర్ వర్క్స్ వచ్చే తాగునీటి పంపింగ్ లైన్‌పై ఏర్పడిన లీకును పరిశీలించి, తాగునీటి వృథాని అరికట్టడానికి లీకు మరమ్మతు పనులు చేపట్టాలని డీఈఈని ఆదేశించారు. పర్యటనలో ఈఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ రమేష్ బాబు, హనీఫ్, ఏఎంహెచ్‌వో ఆనందకుమార్, ఏఈలు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



గోరంట్ల కొండ వద్ద రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

హౌసింగ్ నిర్మాణాలపై పర్యవేక్షణ ఉండాలి

గుంటూరు నగరపాలక సంస్థ హౌసింగ్ లేఅవుట్స్‌లో ఇళ్ల నిర్మాణ పనుల కాంట్రాక్టు పొందిన కాంట్రాక్టర్లు, సొంతగా నిర్మాణం చేసుకునే వారు డిసెంబర్ నాటికి నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పూర్తి చేసేలా హౌసింగ్, నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారులు ప్రతి రోజూ పర్యవేక్షణ చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో ఇంజినీరింగ్, హౌసింగ్ డిపార్ట్‌మెంట్ అధికారులు, ఎమినిటి కార్యదర్శులు, కాంట్రాక్టర్లు, మెప్మా సిబ్బందితో హౌసింగ్ లేఅవుట్స్‌లో ఇళ్ల నిర్మాణ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ తొలుత లే అవుట్స్ వారీగా ఇళ్ల నిర్మాణం ఏ మేరకు పూర్తి అయింది, గ్రౌండ్ లెవల్ ఎన్ని ఉన్నది, మౌలిక వసతులు, బిల్స్ చెల్లింపు, ఇసుక, సిమెంట్, ఇనుము లభ్యత తదితర అంశాలపై లేఅవుట్ల వారీగా ఎమినిటి కార్యదర్శులను, కాంట్రాక్టర్లను అడిడి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హౌసింగ్ లేఅవుట్స్ లో ఇళ్ల నిర్మాణ పనులు కాంట్రాక్టర్ల వారీగా ఇచ్చిన టైం లైన్ మేరకు జరగాలని, నిర్మాణ పనుల కాంట్రాక్ట్ పొందిన కాంట్రాక్టర్లు అవసరమైన కార్మికులను సిద్ధం చేసుకోవాలన్నారు. పేరేచర్ల లేఅవుట్‌లో నీటి సమస్య పరిష్కారానికి బోర్లు ఏర్పాటు చేశామని, త్వరలో లే అవుట్ ప్రధాన రోడ్డు మరమ్మతులు కూడా పూర్తి చేస్తామని తెలిపారు. స్థల లబ్ధిదారుల్లోని డ్వాక్రా సభ్యులకు బ్యాంక్‌ల నుంచి రూ.35 వేలు రుణం అందించేలా చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా ఉంటున్న మెప్మా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి, మంగళవారం నాటికి రుణాలు మంజూరు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, మెప్మా పీడీ విజయలక్ష్మి, హౌసింగ్ ఈఈ శంకర్రావు, ఈఈ సుందర్రామిరెడ్డి, ఉపా సెల్ పీవో రామారావు, హౌసింగ్ డీఈఈలు, ఏఈలు, ఎమినిటి కార్యదర్శులు పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న కొరివి వినయ్‌కుమార్

గ్రామీణ ఉపాధి హక్కుల ఉద్యమం రాజకీయ పోరాటమే

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ హక్కుల పరిరక్షణ కోసం జరుగుతున్న ఉద్యమం రాజకీయ పోరాటమేనని దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్ తెలిపారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేతకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలను మానుకోవాలని, బడ్జెట్ పెంచాలని డిమాండ్ చేస్తూ గురువారం ఢిల్లీలో ప్రారంభించిన ధర్నాలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ పథకానికి కేంద్రం నిధుల కేటాయింపును తగ్గిస్తోందని కొరివి వినయ్‌కుమార్ విమర్శించారు. గత ఆర్థిక సంవత్సరంలో పని డిమాండ్ చేసిన వారందరికీ చట్టబద్ధంగా హామీ ఇచ్చినట్లు 100 రోజుల పనిని అందించేందుకు బడ్జెట్ జీడీపీలో రెండు శాతం ఉండాలని కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసినప్పటికీ ప్రస్తుతం బడ్జెట్ కేటాయింపులు కేవలం రూ.86 వేల కోట్లు మాత్రమేనని ఆయన తెలిపారు. ఇది సగటు ఉపాధి హామీ వేతన రేటుతో 34 రోజుల పని దినాలు కల్పించేందుకు మాత్రమే సరిపోతుందని ఆయన వివరించారు. ఉపాధి హామీ పథకంలో రోజువారి వేతనాలు రూ.800కు పెంచాలని వినయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సకాలంలో వేతనాలు చెల్లించాలని కోరారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న గోనుగుంట్ల కోటేశ్వరరావు తదితరులు

'త్రిశూలం' నాటక పుస్తకావిష్కరణ

గుంటూరు(తూర్పు), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై కళావిపంచి, ఆరాధన ఆర్ట్స్ అకాడమీ, నటరత్న ఎన్టీఆర్ కళాపరిషత్ సౌజన్యంతో ఉషోదయ కళానికేతన్ 18వ వార్షిక వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో భాగంగా ప్రముఖ దర్శకుడు, నటులు, రచయత చెరుకూరి సాంబశివరావు రచించిన త్రిశూలం నాటక పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. సభకు రచయిత, నాటక ప్రయోక్త కందిమళ్ల సాంబశివరావు అధ్యక్షత వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ సంస్థల చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు హాజరై త్రిశూలం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రంగస్థల, సినీ నటుడు డాక్టర్ ముత్తవరపు సురేష్ బాబు, కె.సి.పి. ఇండియా లిమిటెడ్ ఉపాధ్యక్షుడు వజ్జా మధుసూదనరావు, నటులు, రచయత, దర్శకుడు జరుగుల రామారావు, రచయిత, దర్శకులు కావూరి సత్యనారాయణ, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సి.హెచ్.మస్తానయ్య నటుడు మానాపురం సత్యనారాయణ, రవాణా అధికారి బి. మధుసూదనరావు, కళావిపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహారావు పాల్గొన్నారు. అనంతరం ఉషోదయ కళానికేతన్, కట్రపాడు వారి నిర్వహణలో చెరుకూరి సాంబశివరావు రచన, దర్శకత్వం వహించిన కిడ్నాప్ నాటిక సందేశాత్మకంగా సాగింది.



కరపత్రాలను విడుదల చేస్తున్న వైకే, డాక్టర్ ఆలా తదితరులు

8న ది షుద్రా రిబెలియన్ పుస్తకావిష్కరణ

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ కంచె ఐలయ్య రచించిన ది షుద్రా రిబెలియన్ పుస్తకావిష్కరణ కార్యక్రమం ఈనెల 8న బ్రాడీపేటలోని హోటల్ సింధూరిలో జరుగుతుందని సీనియర్ న్యాయవాది వై.కోటేశ్వరరావు (వైకే), బీసీ నాయకులు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా బ్రాడీపేటలో గురువారం పుస్తకావిష్కరణకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వైకే మాట్లాడుతూ ప్రొఫెసర్ కంచె ఐలయ్య రచించిన ది షుద్రా రిబెలియన్ పుస్తకావిష్కరణకు ఐలయ్యతో పాటు ఆచార్య నాగార్జున యూనివర్శిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ వియన్నారావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, కార్మికశాఖ అడిషనల్ సెక్రటరీ గంధం చంద్రుడు పలువురు ప్రముఖులు హాజరవుతారన్నారు.

పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పించండి



మంత్రి లోకేశ్‌తో మాట్లాడుతున్న మీరావలి

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షంలో పార్టీ కోసం అంకిత భావంతో కష్టపడి పని చేసిన వారికి సముచిత స్థానం కల్పించాలని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేష్‌ను జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు షేక్ మీరావలి కోరారు. ఈ మేరకు గురువారం ఆయన మంగళగిరిలోని పార్టీ జాతీయ కార్యాలయంలో లోకేష్‌ను కలిశారు. పార్టీ కోసం కష్టపడి పని చేసిన కార్యకర్తలకు న్యాయం చేయాలని కోరారు. తెలుగుదేశం పార్టీ అధికారం లేని సమయంలో పార్టీ కోసం పోరాటాలు చేసి, పోలీస్ కేసులకు వెనుకాడని వారిని గుర్తించి సముచిత స్థానం కల్పించాలని కోరారు. ఇందుకు స్పందించిన లోకేశ్ , పార్టీ కోసం కష్టపడి పని చేసిన వారందరికీ తగిన గుర్తింపు ఇస్తామని హామీ ఇచ్చారు.

ఎట్టకేలకు రింగ్‌రోడ్డులో స్పీడ్‌బ్రేకర్ల ఏర్పాటు

● ఆంధ్రజ్యోతి కథనాలకు స్పందన

● ట్రాఫిక్ పోలీసులు మున్సిపల్ అధికారుల చొరవ

● వరుస ప్రమాదాలు, మరణాలకు చెక్

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఎటకేలకు రింగ్‌రోడ్‌లో స్పీడ్ బ్రేకర్స్‌కు మోక్షం లభించింది. రింగ్‌రోడ్‌లో కొంత కాలంగా జరుగుతున్న వరుస రోడ్డు ప్రమాదాలు, మరణాల నేపథ్యంలో ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన వరుస కథ నాలతో అధికార యంత్రాంగం స్పందించింది. ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల నేపథ్యంలో ట్రాఫిక్ డీఎస్పీ ఎం రమేష్, వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య, నగరపాలక సంస్థ అధికారులు కదిలారు. రింగ్‌రోడ్డుకు సంబందించి గుజ్జనగుండ్ల - కొరిటెపాడు, లక్ష్మీపురం రోడ్లలో పలు చోట్ల శాశ్వత ప్రాతిపాదికన స్పీడ్ బ్రేకర్‌లు ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి నవభారత్‌నగర్, 1వ లైను, 4వ లైను, ఎన్టీఆర్ స్టేడియం, బేకర్స్‌ఫన్ తదితర ప్రాంతాల్లో వేగనియంత్రకాలు ఏర్పాటు చేశారు. ఆయా రోడ్లలో గురువారం రాత్రి మరికొన్ని ప్రదేశాల్లో వేగ నియంత్రకాలను ఏర్పాటు చేయనున్నట్లు వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య తెలిపారు. ట్రాఫిక్ పోలీసులకు, మున్సిపల్ అధికారు లకు ప్రజలు దన్యవాదాలు తెలిపారు. గతంలో మాదిరిగా ప్లాస్టిక్ డివైడర్‌లు కాకుండా కాంక్రీట్‌తో ప్రధాన జంక్షన్లలో మూడు వరుసలతో డివైడర్‌లు ఏర్పాటు చేయడంతో రేసింగ్, స్నేక్ డ్రైవింగ్‌కు చెక్ పడనుంది. ఇటీవల కాలంలో ఓవర్ స్పీడ్ కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృతి చెందారు. కొంతమంది యువకులు కొరిటపాడు - గుజ్జనగుండ్ల ప్రధాన రహదారిపై తమ ఇష్టానుసారం ద్విచక్ర వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ఎస్పీ ఆదేశాల మేరకు స్పీడ్‌బ్రేకర్స్‌ను కొరిటపాడు - గుజ్జనగుండ్ల ప్రధాన రహదారిపై ఇరువైపులా అమర్చి ప్రమాద హెచ్చరికల సూచికలను ఏర్పాటు చేయించారు.



రింగ్‌రోడ్డులో స్పీడ్ బ్రేకర్లను పరిశీలిస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ రమేష్

నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తా

● ఎమ్మెల్యే గళ్లా మాధవి



నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గళ్లా మాధవి చెప్పారు. నియోజకవర్గంలోని 32వ డివిజన్ బ్రాడీపేట ఐదోలైనులో రూ.49.60 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణాలకు గురువారం ఆమె శంకుస్థాపన చేశారు. బ్రాడీపేట 5/7 నుంచి 5/9 వరకు రూ.40 లక్షలతో ఆర్‌సీసీ కల్వర్టులు, డ్రెయిన్లు, సీసీ రోడ్ల నిర్మాణం, 1/18 నుంచి 2/18 వరకూ రూ.9 లక్షలతో సీసీ డ్రైన్, కల్వర్టు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎప్పటి నుంచో కనీసం డ్రైన్లు కూడా లేక ప్రజలు ఇబ్బంది పడుతున్న ఈ ప్రాంతంలో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణ పనులు చేపట్టడం ప్రజల పట్ల కూటమి ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. పనులను వేగంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లు, అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. 20 రోజుల్లోనే ఈ పనులను పూర్తి చేసి ప్రజలకు సదుపాయాలు అందుబాటులోకి తీసుకోస్తామని ఎమ్మెల్యే గళ్లా మాధవి హామీ ఇచ్చారు. ఏడాదిన్నర క్రితం వైసీపీ హయంలో బ్రాడీపేట నాలుగోలైన్ రహదారి పనులు ప్రారంభించి నిలిపేశారని, దీంతో రెండు కిలోమీటర్ల మేర దారంతా గుంతలు పడి దారుణంగా దెబ్బతిని ప్రజలు ప్రత్యక్ష నరకం చూశారని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ పనులను అత్యంత వేగంగా పూర్తి చేసామని చెప్పారు. కార్యక్రమంలో జూపిటర్ ప్రసాద్, హర్షేన్, నేపాక పద్మావతి, సిరిపురపు శ్రీధర్, ఈరంటి వర ప్రసాద్, నాగ జయంతి, గడ్డం శ్రీను, కరిముల్లా తదితరులు పాల్గొనారు.

అధునాతన సౌకర్యాలతో తేజా ఫార్చ్యూన్ హోమ్స్



తేజా ఫార్చ్యూన్ హోమ్స్ విల్లాస్‌ను అందజేస్తున్న తేజా ఇన్‌ఫ్రా డెవలపర్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ యశ్వంత్‌రెడ్డి తదితరులు

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, అండర్ గ్రౌండ్ ఎలక్ట్రిసిటీ, సీసీ రోడ్లు, క్లబ్ హైస్ వంటి ఎన్నో అధునాతన సౌకర్యాలతో తేజా ఫార్చ్యూన్ హోమ్స్ అందుబాటులోకి తెచ్చినట్లు తేజా ఇన్‌ఫ్రా డెవలపర్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ యశ్వంత్‌రెడ్డి తెలిపారు. ఇటీవల నగరంలోని శ్యామలా నగర్‌లో సకల హంగులతో పూర్తి అయిన విల్లాస్ ప్రాజక్ట్ తేజా ఫార్చ్యూన్ హోమ్స్ అందించేలా 26 ఏళ్ళకే ఇలాంటి ప్రస్టేజియస్ ప్రాజక్ట్ నిర్మించే అవకాశం రావటం అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఇటువంటి గేటెడ్ కమ్యూనిటీ ప్రాజక్టులు మా తేజా ఇన్‌ఫ్రా డెవలపర్స్ సంస్థ నుంచి మరెన్నో నిర్మించి ప్రజలకు అందించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు కస్టమర్లు మాట్లాడుతూ నగరంలో ఆధునిక టెక్నాలజీతో నాణ్యమైన గృహాలను అందించటం ఎంతో సంతోషదాయకంగా ఉన్నదని సంస్థను అభినందించారు.



మాట్లాడుతున్న పాపినేని శివశంకర్, పాల్గొన్న కందిమళ్ల శివప్రసాదు తదితరులు

మౌలిక భావనలు కలిగిన కవి బైరాగి

గుంటూరు(తూర్పు), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తనదైన కంఠస్వరంతో కవిగా తెలుగు సాహిత్యలోకంలో రాణించిన గొప్పవ్యక్తి ఆలూరి బైరాగి అని కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ అన్నారు. స్థానిక ఏఎల్‌బీఈడీ కళాశాల ఆవరణలో జరుగుతున్న విశాలాంధ్ర పుస్తక మహోత్సంలో ఆలూరి బైరాగి సాహిత్య వేదికపై బైరాగి శత జయంతి సభను నిర్వహించారు. సభకు సాహితి విమర్శకుడు కందిమళ్ల శివప్రసాదు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పాపినేని శివశంకర్ మాట్లాడుతూ నూతిలో గొంతుకలు, చీకటినీడలు, ఆగమగీతి వంటి కవిత సంపుటాల ద్వారా బైరాగి గుర్తింపు పొందారని వివరించారు. కార్యక్రమంలో అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, బుల్లారవి తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు 50 శాతం ఐఆర్ మంజూరు చేయాలి

గుంటూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నాలుగు లక్షల మంది పెన్షనర్లకు 50 శాతం మధ్యంతర భృతి మంజూరు చేయాలని ముఖ్యమంత్రిని వినతిపత్రం ద్వారా కోరినట్లు రాష్ట్ర పెన్షన్‌దారుల చర్చావేదిక అధ్యక్షుడు ఈదర వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త పీఆర్‌సీ కమిషనర్‌ను నియమించినప్పటికీ కార్యాలయం ఏర్పాటు కానీ, సిబ్బందిని నియమించటం కానీ జరగలేదన్నారు. ఎప్పటికి నివేదిక వస్తుందో కూడా తెలియదన్నారు. ఆ కారణంగా మధ్యంతర భృతి మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగులు తమ సర్వీసు కాలంలో వేతన సవరణ కావాలని కోరుకుంటారన్నారు. వేతన సవరణకు ప్రభుత్వం సంఘం నియమించిందంటే చాలు, తమ వేతనాలు పెరుగుతాయని, ఇంటి అద్దె, భత్యం పెరుగుతాయని వారిలో ఆశలు చెలరేగుతాయన్నారు. ఆ దిశగానే ప్రణాళికలు వేసుకుంటారన్నారు. ఎప్పుడు పీఆర్‌సీ నివేదిక వస్తుందా అని ఎదురుచూస్తుంటారన్నారు. పాత పీఆర్‌సీ అమలు పరిచినప్పటికీ దాని ప్రయోజనాలు సంపూర్ణంగా పెన్షనర్లకు గాని, ఉద్యోగులకు గాని అందలేదన్నారు. అనేక సార్లు ఉద్యోగ సంఘాలు పలు విజ్ఞప్తులు చేసినప్పటికీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని తమ కోరికలను తిరస్కరిస్తూనే ఉన్నారన్నారు.

మరపురాని.. మహానటి

నేడు సావిత్రి జయంతి





పాఠశాలలో ఏర్పాటు చేసిన సావిత్రి విగ్రహం

సావిత్రి అంటే మహానటి.. మహానటి అంటే సావిత్రి. ఈ రెండూ ఒకదానికొకటి పర్యాయపదాలు అంటే అతిశయోక్తి కాదనిపిస్తుంది. పలు చిత్రాల్లో విభిన్నమైన పాత్రల్లో తన నటనా కౌశలంతో ప్రేక్షకులను మైమరపించేలా చేసిన సావిత్రి జయంతి నేడు. సావిత్రి జయంతిని పురస్కరించుకుని ఆమె జ్ఞాపకాలను తీరప్రాంత ప్రజలు గుర్తు చేసుకుంటూ ఉంటారు. ఎన్నో దానధర్మాలు, సామాజిక సేవా కార్యక్రమాలు చేసింది. రేపల్లె మండలంలోని వడ్డివారి పాలెం సావిత్రి తల్లి సుభద్రమ్మ స్వగ్రామం. ఈ గ్రామంలో 1962లో శ్రీమతి సావిత్రి గణేష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సావిత్రి స్థాపించింది. ఇప్పటి వరకు ఎంతో మంది విద్యార్థులు ఈ పాఠశాలలో చదువుకుని తమ జీవితాలకు బాటలు వేసుకున్నారు.

- 1962లో వడ్డివారిపాలెంలో స్థాపించిన సావిత్రి గణేష్ జడ్పీ ఉన్నత పాఠశాల
- కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ఫలితాలు
- జిలాల్లోనే ఆదర్శ పాఠశాలగా గుర్తింపు



సావిత్రి నాటిన అశ్వత్థ వృక్షం వద్ద సావిత్రి కుమార్తె విజయ చాముండేశ్వరి (ఫైల్)

అశ్వత్థ వృక్షం నాటిన సావిత్రి

పాఠశాల ప్రారంభించిన మరుసటి సంవత్సరం 1963లో ఆ పాఠశాల ప్రాంగణంలో సావిత్రి ఓ అశ్వత్థ వృక్షం నాటింది. అప్పటి నుండి పలుమార్లు పాఠశాలకు వచ్చి అక్కడి బాగోగులు చూస్తుం డేది. ఈ గ్రామంలోని పుట్టింటి వారి బంధువులకు ఆర్థికంగా సావిత్రి చేయూత నిచ్చింది. సావిత్రి జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం వడ్డివారిపాలెం పాఠశాలకు కుమార్తె విజయచాముండేశ్వరి, భర్త గోవిందరావు ఈ పాఠశాలకు వచ్చి విద్యార్థులకు కొంత ఆర్థికసాయంతో పాటు పాఠశాలకు కావాల్సిన సౌకర్యాలు కల్పిస్తున్నారు. 1981 డిసెంబర్ 26వ తేదీన సావిత్రి తుది శ్వాస విడిచారు.

రేపల్లె,డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): సినీ నటి సావిత్రి 1936 డిసెంబరు 6న తాడేపల్లి మండలం చిర్రావూరులో నిశంకరం గురవయ్య, సుభద్రమ్మలకు మొదటి సంతానంగా జన్మించింది. వందలాది సినిమాల్లో హీరోయిన్‌గా వివిధ పాత్రల్లో నటించి తన నటనా కౌశలంతో ఎంతో పేరు గడించింది. 1955లో జెమిని గణేష్‌ను వివాహం చేసుకుంది. సావిత్రి కుమార్తె విజయ చాముండేశ్వరి, కుమారుడు సతీష్‌కుమార్. సొంత ఊరిని, తల్లిదండ్రులను మరువకూడదనే ఉద్దేశంతో సావిత్రి తన తల్లి స్వగ్రామం అయిన రేపల్లె మండలం వడ్డివారిపాలెంలో శ్రీమతి సావిత్రి గణేష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను 1962లో స్థాపించింది. వేలాది విద్యార్థుల జీవితాలకు బాటలు వేసింది. జిల్లాలోనే ఆదర్శవంతమైన పాఠశాలగా పేరు పొందింది. దినదినాభివృద్ధి చెందుతూ సరస్వతీ నిలయంగా విరాజిల్లుతున్న ఈ పాఠశాల పదవ తరగతిలో నూటికి నూరు శాతం ఫలితాలను గత పదేళ్లుగా సాధిస్తోంది. కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా నిలుస్తోంది. తొలుత ప్రాథమిక పాఠశాలగా ప్రారంభమై జడ్పీ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ పొందింది. అప్పటి నుండి తీరప్రాంతంలో ఆ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఇంటికి ఒకరు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. పాఠశాల నుంచి ప్రతి సంవత్సరం 30 నుంచి 40 మంది పదవ తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తూ పలు పాఠశాలలకు ఆదర్శంగా నిలు స్తోంది. 2015-16 సంవత్సరంలో హాజరైన 31 మంది విద్యార్థులూ వంద శాతం ఉత్తీర్ణతతోపాటు 9.5 జీపీఏ సాధించారు. 2016-17లో 27 మంది, 2017-18లో 38 మంది పరీక్షలకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణత పొందారు. ముప్పై ఎనిమిది మందిలో ఐదుగురు విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో సీట్లు కూడా లభించాయి. ముగ్గురు విద్యార్థులు 10 జీపీ సాధించారు. 2019 నుంచి 2023 వరకు పదో తరగతిలోనూ నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించడం ఈ పాఠశాల సత్తాను తెలియ జేస్తుంది. అంతేకాకుండా, ఖోఖో, వాలీబాల్, బాల్‌బ్యాడ్మింటన్, తైక్వాండో తదితర క్రీడల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో గెలుపొంది ఈ పాఠశాలకు గుర్తింపు తీసుకొస్తున్నారు.



శ్రీమతి సావిత్రి గణేష్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

76 మంది మగ ఆరోగ్య కార్యకర్తలు విధుల నుంచి తొలగింపు

గుంటూరు సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో వైద్య , ఆరోగ్య శాఖలో మగ ఆరోగ్య కార్యకర్తలగా పనిచేస్తున్న 76 మందిని విధుల నుండి తొలగిస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు గురువారం సాయంత్రం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి విజయలక్ష్మి ఉత్తర్వులు విడుదల చేశారు. విధుల నుంచి తొలగొంచిన మగ ఆరోగ్య కార్యకర్తలు గత ఇరవై ఏళ్లుగా ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్నారు. జీఓ నంబర్ 1207ను గత వారంలో హైదరాబాద్ హైకోర్టు పక్కన పెట్టడంతో దాని ద్వారా నియ మితులైన ఆరోగ్య కార్యకర్తలను యుద్ధప్రాతిపదికన విధుల నుంచి తొలగొంచారు. ఈ ఉత్తర్వులు ఆయా ఉద్యోగులకు వెంటనే అంద జేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల్లో పేర్కొన్నారు. ఈ విషయమై కాంట్రాక్టు ఆరోగ్య కార్యకర్తలు స్పందిస్తూ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణ బాబు తమకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. ప్రభుత్వం దృష్టికి కోర్టు తీర్పు విషయాన్ని తీసుకువెళ్ళకుండా ఉన్న పళంగా రోడ్డున పడవేశారని ఆరోపించారు. తొలగించిన ఉద్యోగుల్లో చాలా మంది 50 సంవత్సరాలు దాటిన వారు కూడా ఉన్నారని తెలిపారు. ఈ వయస్సులో ఎలా బతకాలి.. కుటుంబాన్ని ఏవిధంగా పోషించు కోవాలని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ ఈ విషయంలో జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

మెమూ రైళ్ల అనవసర నిలుపుదల

గుంటూరు ఎస్ఎస్‌పై ప్రయాణికుల ఆగ్రహం

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిత్యం రాత్రి వేళ గుంటూరు-విజయవాడ మధ్యన ప్రయాణించే మెమూ రైలుని రైల్వే వర్గాలు అనవసరంగా నిలుపుదల చేస్తున్నాయి. ఈ రైలు నిత్యం సాయంత్రం వేళ మాచర్ల నుంచి బయలుదేరి రాత్రి 7.45కి గుంటూరుకు వస్తుంది. ఆ తర్వాత నంబరు మార్చి గుంటూరులో 8.10కి బయలుదేరి రాత్రి 9.25కి విజయవాడ చేరుకునేలా టైంటేబుల్ రూపొందించారు. ఈ రైలు గుంటూరులో మూడు రోజుల నుంచి గంటకు పైగా ఆలస్యంగా బయలు దేరుతుంది. అందుకుగల కారణాలను ఎవరూ చెప్పడం లేదు. అదేమంటే వేరే బోగీలు, లోకోని జత చేయా లని సమాధానం చెబుతున్నట్లు ప్రయాణికులు తెలిపారు. ఈ విష యంపై గురువారం రాత్రి ప్రయాణికులు స్టేషన్ సూపర్‌వైజర్‌ని నిలదీశారు.

ఆదర్శప్రాయుడు శ్రీరాముడు

ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు



వట్టిచెరుకూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అన్ని తరా లకు ఆదర్శప్రాయుడు శ్రీరామ చంద్రుడు అని ప్రవచనకర్త, పద్మశ్రీ గరికపాటి నరసింహారావు ప్రవచించారు. మండలంలోని వింజనంపాడులోని శ్రీ కోదండ రామస్వామి దేవాలయంలో జరుగుతున్న శ్రీరామ నాయ సప్తాహ మహోత్సవాలలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మూడు లోకాలలో అత్యంత శక్తివంతుడు శ్రీ రాముడని, అయినా తండ్రి మాట దాటడన్నారు. కష్టాలను ఓర్చుకుని బతకాలని శ్రీరాముడి కథ నేర్పుతుందని చెప్పారు. నేటి తరం శ్రీ రాముని కథ తెలుసుకుని తలిదండ్రులపై బాధ్యతగా మెలగాలని హితవు పలికారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల పట్ల స్నేహపూర్వకంగా ఉండాలన్నారు. రామాయణంతో మన జీవితం ముడిపడిందని, ప్రతి ఒక్కరూ పఠనం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రవాసాంధ్రుడు చిరుమామిళ్ల వెంకటరత్నం, కిట్స్ కళాశాల చైర్మన్ కోయా సుబ్బారావు, కార్యదర్శి కోయా శేఖర్, ఉగ్గిరాల సీతారామయ్య, రాయపాటి సత్యనారాయణ పాల్గొన్నారు.



హాజరైన భక్తులు

మిల్లుల్లో ఖాళీ లేదు

ధాన్యం రైతుల పరిస్థితి అగమ్యగోచరం

అమ్మకాలు 50 వేల ఎంటీలే.. మిగులు 2.40 లక్షల మెట్రిక్ టన్నులు

తేమ శాతం ఎక్కువగా ఉన్నా కొనుగోలు చేయాలన్న ముఖ్యమంత్రి

గుంటూరు సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలుకు స్థల సమస్య అడ్డంకిగా మారింది. మిల్లుల్లో ఖాళీ లేకపోవడంతో కొనుగోలుకు మిల్లర్లు ముందుకు రావడం లేదు. ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యం మిల్లుల్లోనే ఉండిపోవడం రైతులకు శాపంగా మారుతుంది. గుంటూరు జిల్లాలో ఇప్పటివరకు సుమారు 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోళ్లు జరిగినట్లు తెలుస్తోంది. తేమ శాతం ఎక్కువగా ఉండటంతో మిల్లర్లు కొనుగోలుకు వెనకాడుతున్నట్లు తెలుస్తోంది. రైతుల వద్ద ఇంకా 2 లక్షల 40 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది జిల్లాలో 56 వేల హెక్టార్లలో వరి సాగు కాగా, సుమారు 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని తెలుస్తోంది.

కొనుగోళ్లపై సీఎం సమీక్ష

ధాన్యం కొనుగోళ్లపై ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం కలెక్టర్ నాగలక్ష్మితో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. భారీ రైతుల శ్రేయస్సు దృష్ట్యా తేమ శాతం ఎక్కువున్నా ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేయాలని, రైతు నష్టపోకుడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రొక్యూర్మెంట్ సపోర్టింగ్ ఏజెన్సీ వ్యవసాయశాఖ సిబ్బంది గ్రామాలకు వెళ్లి రైతులలో అవగాహన కల్పించాలని సూచించారు. రైతులు తమ



సీఎంతో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నాగలక్ష్మి

ధాన్యాన్ని దళారులకు కనీస మద్దతు ధరకంటే తక్కువ ధరకు అమ్ముకుని నష్టపోవద్దని వారికి తెలియజేయాలని స్పష్టం చేశారు. రైతులు ఎదుర్కొనే సమస్యలపై వెంటనే స్పందించి, కొనుగోలు ప్రక్రియ సాఫీగా కొనసాగేలా చేయాలని ముఖ్యమంత్రి కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయ అధికారి ఎన్ వెంకటేశ్వరరావు, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ జి.లక్ష్మి, జిల్లా సప్లయిస్ అధికారి కోమలి పద్మ, బిజినెస్ మేనేజర్ హరిగోపాలం పాల్గొన్నారు.

టోల్ ఫ్రీ నెంబర్

రైతులు ధాన్యం విక్రయాల్లో వచ్చిన ఇబ్బందుల పరిష్కారానికి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. రైతులు తమ సమస్యలను 9491392717కి ఫోన్ చేసి ఫిర్యాదులు చేస్తే పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు.

మిర్చి లారీని మళ్లీ అడ్డుకున్న యూనియన్ నాయకులు

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మిర్చి లారీల యూనియన్‌కు చెందిన కొందరు నాయకులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొంటున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు, పోలీసులు ఎంత చెప్పినా వీరి చెవికి ఎక్కడం లేదు. తమ యూనియన్‌తో సంబంధం లేకుండా మిర్చి లారీని ఎవరైనా లోడింగ్‌కు పెడితే ఆ వాహనాన్ని అడ్డుకొంటున్నారు. గురువారం రాత్రి పెదకాకాని సమీపంలో ఇలాంటి సంఘటనే జరిగింది. యూనియన్‌తో సంబంధం లేకుండా ఒక ఎగుమతిదారుడు ఈశాన్య రాష్ట్రాలకు మిర్చిని ఎగుమతి చేసేందుకు లారీ లోడింగ్ చేసుకొంటుండగా తమ అనుమతి లేకుండా ఎలా చేస్తారంటూ వెళ్లి అడ్డుకొన్నారు. కాగా గురువారం ఉదయం ఈ అంశంపై ఎగుమతిదారులు మంత్రి అచ్చెన్నాయుడుకు నివేదించారు. దీనిపై తాను రవాణ శాఖ కమిషనర్‌తో మాట్లాడతానని హామి కూడా ఇచ్చారు అయితే గంటల వ్యవధిలోనే యూనియన్ నాయకులు లారీనఇ అడ్డుకోవడం అధికార యంత్రాంగం చేతకానితనాన్ని తేటతెల్లం చేస్తున్నది.

10న జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ ఎంపికలు

గుంటూరు(తూర్పు), డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఈనెల 10న స్థానిక బీ ఆర్ స్టేడియంలో జిల్లా క్రాస్ కంట్రీ ఎంపికలు నిర్వహిస్తున్నట్టు సంఘ కార్యదర్శి జీవీఎస్ ప్రసాదు ఒక ప్రకటనలో తెలిపారు. అండర్- 16, 18, 20 బాల, బాలికలు, పురుషులు, మహిళల విభాగాల్లో ఎంపికలు జరుగుతాయని తెలిపారు. ఆసక్తి గల్గిన క్రీడాకారులు ఆధార్ కార్డు, వయస్సు ధ్రువీకరణ పత్రంతో పాటు, రెండు ఫొటోలు తీసుకుని అదే రోజున ఉదయం 8 గంటలకు రిపోర్టు చేయాలన్నారు.

చిలకలూరిపేట బైపాస్ ప్రారంభం

పేటవాసులకు తప్పిన ట్రాఫిక్ తిప్పలు

చిలకలూరిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రూ.1,000 కోట్లతో 16.38 కిలోమీటర్ల పొడవున మార్టూరు యడ్లపాడు మధ్య రామచంద్రాపురం నుంచి తిమ్మాపురం వరకు నిర్మించిన చిలకలూరిపేట బైపాస్ రోడ్డుపై గురువారం సాయంత్రం నుంచి రాకపోకలు ప్రారంభమయ్యాయి. గత నెల 29న విశాఖ నుంచి ప్రధాని నరేంద్రమోదీ చేత రిమోట్ ద్వారా ప్రారంభింపచేయాలని అధికారులు తలపెట్టారు. అయితే ప్రధాని కార్యక్రమం రద్దు కావడంతో అది ఆగిపోయింది. అయితే చిలకలూరిపేట పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య జటిలమవుతుండడంతో నేషనల్ హైవేస్ ఉన్నతాధికారులు అకస్మాత్తుగా జారీ చేసిన ఆదేశాల మేరకు బైపాస్‌పై రాకపోకలకు అనుమతించాలని నిర్ణయం తీసుకున్నారు. నేషనల్ హైవేస్ పీడీ పార్వతీశం స్వయంగా వచ్చి బైపాస్‌పై ఉన్న అడ్డంకులను క్రేన్లతో తొలగింపచేసి వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యేలా చూశారు. బైపాస్ రోడ్డులో రాకపోకలు ప్రారంభం కావడంతో చిలకలూరిపేట ప్రజలకు ఎన్నో ఏళ్లుగా ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది.

దేశంలోనే మొదటి మోడల్ బైపాస్ రోడ్డు

చిలకలూరిపేట బైపాస్ దేశంలోనే మొదటి మోడల్ బైపాస్ రోడ్డుగా రూపొందింది. అత్యంత సుందరంగా దీనిని నిర్మించారు. ఒంగోలు నుంచి గుంటూరు వచ్చే మార్గంలో ఎడమ వైపున ఒకవైపే సర్వీస్ రోడ్డు నిర్మించారు. మధ్యలో గ్రామాలు, రోడ్లు ఉన్న ప్రాంతాల్లో మాత్రం రెండు వైపులా సర్వీస్ రోడ్డు నిర్మాణం జరిగింది. గణపవరం వద్ద రోడ్డు పక్కన ఉన్న విశాలమైన ప్రదేశంలో మెగా వాట్ సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను కూడా ఏర్పాటు చేశారు. రోడ్డు పొడవునా ట్రీగార్డులతో 3,500 మొక్కలు నాటారు. అధునాతనమైన ట్రాఫిక్ మేనేజ్మెంట్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. మూడు ఫ్లైఓవర్లు, ఆరు అండర్ పాస్‌ల నిర్మాణం జరిగింది. బైపాస్ కారణంగా ఒంగోలు - గుంటూరు మధ్య ప్రయాణం చేసే వారికి సుమారు 30 నిమిషాల సమయం ఆదా అవుతుంది.



నరసరావుపేట రోడ్డులో నిర్మించిన అండర్ పాస్

నేటి నుంచి విజయ్ మర్చంట్ ట్రోఫీ

మంగళగిరి, మూలపాడులో ఏసీఏ ఏర్పాట్లు పూర్తి

మంగళగిరి సిటీ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ దేశవాళీ టోర్నీ విజయ్ మర్చంట్ ట్రోఫీ గ్రూపు-డీ మ్యాచ్‌లు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయని ఏసీఏ అధ్యక్ష, కార్యదర్శులు కేశినేని శివనాథ్, సానా సతీశ్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ట్రోఫీకి సంబంధించి మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం, మూలపాడులోని డీవీఆర్, సీపీ మైదానాలను సిద్ధం చేశారు. 6 నుంచి 8వ తేదీ వరకు కర్ణాటక-విదర్భ (మంగళగిరి), రాజస్థాన్-జార్ఖండ్(డీవీఆర్), అస్సాం-ఉత్తరాఖండ్(సీపీ), 11 నుంచి 13వ తేదీ వరకు రాజస్థాన్-ఉత్తరాఖండ్ (మంగళగిరి), ఝార్ఖండ్-కర్ణాటక(డీవీఆర్), జమ్మూకశ్మీర్-విదర్భ (మూలపాడు సీపీ), 17 నుంచి 19 వరకు రాజస్థాన్-విదర్భ (మంగళగిరి), జమ్మూకశ్మీర్-కర్ణాటక (డీవీఆర్), జార్ఖండ్-ఉత్తరాఖండ్(సీపీ), 22 నుంచి 24 వరకు కర్ణాటక-ఉత్తరాఖండ్(మంగళగిరి), రాజస్థాన్-జమ్మూకశ్మీర్ (డీవీఆర్), జార్ఖండ్-విదర్భ (సీపీ), 28 నుంచి 30 వరకు జమ్మూకశ్మీర్-జార్ఖండ్(మంగళగిరి), ఉత్తరాఖండ్-విదర్భ (డీవీఆర్), రాజస్థాన్-కర్ణాటక(సీపీ) మధ్య మ్యాచ్‌లు జరుగుతాయని తెలిపారు.

అరుణాచలం వెళ్లే యాత్రికులకు ప్రత్యేక రైలు

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అరుణాచల క్షేత్రంలో ఈ నెల 13న కార్తీగై దీపం(తమిళ క్యాలెండర్ ప్రకారం కార్తీక దీపం) జరగనున్న దృష్ట్యా అక్కడికి వెళ్లే యాత్రికుల సౌలభ్యం కోసం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైలుని నడపనున్నట్లు ప్రకటించింది. నంబరు 07601 సికింద్రాబాద్ - విల్లుపురం ప్రత్యేక రైలు ఈ నెల 12న(గురువారం) రాత్రి 7.40కి బయలుదేరి నడికుడి, సత్తెనపల్లి మీదగా అర్ధరాత్రి 12.10కి గుంటూరు చేరుకుంటుంది. అనంతరం 12.20కి బయలుదేరి శుక్రవారం ఉదయం 11.50కి తిరువణ్ణామలై, మధ్యాహ్నం 1.05కి విల్లుపురం చేరుకుంటుంది. నంబరు.07602 విల్లుపురం - సికింద్రాబాద్ ప్రత్యేక రైలు ఈ నెల 13న శుక్రవారం సాయంత్రం 4.05కి బయలుదేరి శనివారం వేకువజామున 3 గంటలకు గుంటూరు, 3.49కి సత్తెనపల్లి, 4.49కి నడికుడి, ఉదయం 9.40కి సికింద్రాబాద్ చేరుకుంటుంది.

మండల పూజకు ప్రత్యేక రైళ్లు

శబరిమలలో మండలం పూజ, మకరవిలక్కు పండుగలకు వెళ్లే యాత్రికుల సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. నంబరు.07193 మౌలాలి - కొల్లం రైలు ఈ నెల 11, 18, 25 తేదీల్లో నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు మీదగా ప్రయాణిస్తుంది. నంబరు 07194 కొల్లం - మౌలాలి రైలు ఈ నెల 13, 20, 27 తేదీల్లో అక్కడ బయలుదేరి గుంటూరు మీదగా ప్రయాణిస్తుంది. నంబరు. 07149 మౌలాలి - కొల్లం రైలు ఈ నెల 14, 21, 28 తేదీల్లో, నంబరు. 07150 కొల్లం - మౌలాలి రైలు ఈ నెల 16, 23, 30 తేదీల్లో అక్కడ బయలుదేరి గుంటూరు మీదగా ప్రయాణిస్తుంది. నంబరు.07155 కాకినాడ టౌన్ - కొల్లం రైలు జనవరి 6, 13 తేదీల్లో, నంబరు.07156 కొల్లం - కాకినాడ టౌన్ రైలు జనవరి 8, 15 తేదీల్లో, నంబరు.07157 నరసపూర్ - కొల్లం రైలు జనవరి 20, 27 తేదీల్లో, నంబరు.07158 కొల్లం - నరసపూర్ రైలు జనవరి 22, 29 తేదీల్లో బయలుదేరి గుంటూరు మీదగా ప్రయాణిస్తాయి.

ఏఎన్‌యూ వసతిగృహాలకు వార్డెన్ల నియామకం

మహిళ, ఇంజనీరింగ్ వసతిగృహాల చీఫ్ వార్డెన్లుగా డాక్టర్ మాధవి, డాక్టర్ గోపికృష్ణ

పెదకాకాని, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో వసతిగృహాలకు నూతనంగా వార్డెన్ల నియామకం జరిగింది. మహిళా వసతి గృహంలో నెలకొన్న సమస్యలపై ఇటీవల విద్యార్థులను ఆందోళనల నేపథ్యంతో వర్సిటీ అధికారులు తాజాగా నిర్ణయం తీసుకున్నారు. మహిళా వసతి గృహాలకు చీఫ్ వార్డెన్‌తో పాటు అడిషనల్ చీఫ్‌వార్డెన్, డిప్యూటీ వార్డెన్లను నియమిస్తూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కే.గంగాధరరావు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చీఫ్ వార్డెన్‌గా బోటనీ అండ్ మైక్రో బయాలజీ విభాగానికి చెందిన అధ్యాపకురాలు డాక్టర్ జె.మాధవి నియమితులయ్యారు. అదనపు చీఫ్ వార్డెన్‌గా డాక్టర్ వై.సునీత(ఇంజనీరింగ్ కాలేజ్), డాక్టర్ ఎస్.సుజన(ఫార్మసీ కళాశాల), డిప్యూటీ వార్డెన్లుగా డాక్టర్ ఏఎస్‌వీ రాధిక, డాక్టర్ వి.సుభాషిణి, ఝాన్సీలను నియమించారు. ఇంజనీరింగ్ కళాశాలకు చీఫ్ వార్డెన్‌గా అసిస్టెంట్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోపికృష్ణను నియమించారు. అసిస్టెంట్ ప్రిన్సిపల్ డాక్టర్ డీ చంద్రమౌళికి అడిషనల్ చీఫ్ వార్డెన్ బాధ్యతలు అప్పగించారు. డిప్యూటీ వార్డెన్లుగా ఆర్.విజయ్‌ప్రకాష్, యు.సతీష్‌కుమార్, కేఎస్.రాజశేఖర్, డాక్టర్ సీహెచ్ పుణ్యశేఖర్, డాక్టర్ బి.విజయకుమార్‌లను నియమించారు. ఏడాది పాటు వీరు వార్డెన్లుగా విధులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

చేనేత పూర్వవైభవానికి మంత్రి లోకేశ్ కృషి

శిక్షణా శిబిరం ప్రారంభోత్సవంలో పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ అబద్ధయ్య

మంగళగిరి సిటీ, డిసెంబర్ 5(ఆంధ్రజ్యోతి): చేనేత పరిశ్రమకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు మంత్రి నారా లోకేశ్ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య తెలిపారు. ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, చేనేత జౌళి శాఖల ఆధ్వర్యంలో మంగళగిరి టిడ్కో సముదాయంలోని కమ్యూనిటీ హాలులో 45 రోజులు చేనేత కార్మికులకు ఇవ్వనున్న శిక్షణా శిబిరాన్ని గురువారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్రంలో చేనేత రంగం అభివృద్ధికి, కార్మికుల జీవన స్థితిగతులను మెరుగు పరిచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఏనాటి నుంచో వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారు తప్ప యువత చేనేత రంగం వైపు మక్కువ చూపడంలేదని తెలిపారు. యువత చేనేత పట్ల మక్కువ చూపేందుకు ఇలాంటి శిక్షణా శిబిరాలు దోహదం చేస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ అడిషనల్ కమిషనర్ శ్రీకాంత్‌ప్రభాకర్, జేడీ కే.కన్నబాబు, డీడీ వి.భీమయ్య, టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు, చేనేత జౌళి శాఖ ఏడీ బి.ఉదయ్‌కుమార్, జిల్లా నైపుణాభివృద్ధి అధికారి కే.సంజీవరావు, కే.అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణా శిబిరాన్ని ప్రారంభిస్తున్న నందం అబద్ధయ్య

పశ్చిమ డెల్టా కాల్వకు 1902 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1902 క్యూసెక్కుల సాగునీటిని గురువారం విడుదల చేసినట్లు నీటి పారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉంది. దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 244 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 78, పశ్చిమకాల్వకు 73, నిజాంపట్నంకాల్వకు 255, కొమ్మ మూరుకాల్వకు 1110 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



మండలంలోని తుమ్మపూడి గ్రామంలో నూతన వధూవరులు నాలాది మంజు, సురేంద్రలకు మంత్రి నారా లోకేశ్ పంపిన పెళ్లి కానుకను గురువారం అందించారు. టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, ఎంపీటీసీ వాసిరెడ్డి లక్ష్మీదేవి, నర్రా శ్రీనిసవాసరావు, బుస్సా నాగరాజు, నాలాది శ్రీనివాసరావు, రాణి, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు. **(దుగ్గిరాల)**

సహజ ఎరువుల వినియోగంతో భూసారం పెంచుకోవచ్చు : ఏవో

దుగ్గిరాల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడవర్రులో ప్రపంచ నేలల దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల విని యోగంపై జరిగిన అవగాహన సదస్సులో ఏవో పి.శిరీష, భూసారం కాపాడుకునేందుకు తీసుకోవలసిన చర్యలను రైతులకు వివరించారు. అవసరమైన మో తాదులోనే రసాయన ఎరువులను వినియోగించాలని, విచక్షణా రహితంగా వాడినట్లైతే భూమి తన సహజత్వాన్ని కోల్పోతుందన్నారు. పశువుల ఎరువు, వానపాముల ఎరువు, జీవన ఎరువులను తప్పనిసరిగా వాడాలన్నారు. ఆరోగ్య కరమైన నేలలతో ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చునని వివరించారు. రైతులకు ద్రవ, ఘన జీవామృతాల తయారు చేసి చూపారు. ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్‌పీలు, వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

● ఏవో సుధారాణి

పెదనందిపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భూసార పరీక్షలు చేయించు కోవడం వల్ల రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని ఏవో సుధారాణి అన్నారు. మండలపరిధిలోని రావిపాడులో గురువారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రసాయన ఎరువులు వాడడం వల్ల భూమి సారవంతం కోల్పోతుందని తద్వారా దిగుబడులు తగ్గుతాయని, పంటకు సేంద్రియ ఎరువులు వాడాలని, తద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. రైతులు విత్తనాలు నాటే ముందు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలని తెలిపారు. అనంతరం భూసార పరీక్షలు చేయించుకున్న రైతులకు పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఏవో జరీనా, సిబ్బంది పాల్గొన్నారు.

పీఎంఏవై ద్వారా పేదలకు ఇళ్లు

● హౌసింగ్ ఏఈ మారుతి

కాకుమాను, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆవాస్ యోజన -2 ద్వారా పేదలకు ఇళ్ల కోసం అర్హులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని హౌసింగ్ శాఖ ఏఈ మారుతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామ సచివాలయ పరిధిలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు, ఎనిమిటీస్ సెక్రటరీ వద్ద బయోమెట్రిక్ అప్‌డేట్, అలాగే రేషన్ కార్డు, ఆదాయ ధ్రువపత్రం, లబ్ధిదారుని ఆధార్‌కార్డు, తదితర పత్రాలతో స్థానిక సచివాలయ సిబ్బందిని సంప్రదించాలని వివరించారు.

రెండో రోజుకు చేరిన కార్మికుల దీక్షలు

తాడేపల్లి టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని, ఫ్యాక్టరీ కార్మికుల గుడిసెలను ప్రభుత్వ అధికారులు అక్రమంగా కూల్చిన విధానానికి నిరసనగా సిమెంటు కంపెనీ కార్మికులు చేస్తున్న దీక్షలు గురువారంతో రెండో రోజుకు చేరుకున్నాయి. దీక్షలను కార్మికురాలు కూరపాటి దిబోరాణి ప్రారంభించారు. దీక్షల్లో ఎం శారద, జీ అన్నమ్మ, నవనీతం, మల్లికాంబ, రమణ కూర్చున్నారు. యూనియన్ నేత కూరపాటి స్టీవెన్ మాట్లాడుతూ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాలను కలుపుకుని పోరాటం చేయాలన్నారు. శుక్రవారం సిమెంటు ఫ్యాక్టరీ దీక్ష శిబిరం నుంచి మంగళగిరి ఎంటీఎంసీ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు చెప్పారు. వివిధ కార్మిక సంఘాల నాయకులతో సాగే ఈ పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నేత వేముల దుర్గారావు, సూర్యప్రకాష్, ఆశీర్వాదం, యెహోషువ, సుబ్బారావు, గురవయ్య, మల్లేశ్వరి, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణపై కేసు నమోదు

పెదనందిపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు ఘర్షణ పడిన సంఘటనపై పోలీసుస్టేషన్లో గురువారం కేసు నమోదైంది. పోలీసుల సమాచారం మేరకు మండలపరిధిలోని పుసులూరుకు చెందిన షేక్ నాగూర్‌వలి ఇంటి వద్దకు వెళ్లి మేనల్లుడు ఆరీఫ్, అతడి కుటుంబసభ్యులు కలిసి నాగూర్‌వలితో ఘర్షణ పడి, కొట్టి గాయపరిచారు. వలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుపవన్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

మేడికొండూరు డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వేగంగా వెళుతున్న ఆటో రోడ్డు డివైడర్‌కు ఢీకొని పల్టీకొట్టిన ప్రమాదంలో గాయపడిన ఆటో డ్రైవర్ మల్లెల చెన్నారెడ్డి (41) బుధవారం రాత్రి మరణించాడు. పోలీసుల వివరాల ప్రకారం పేరేచర్లకు చెందిన చెన్నారెడ్డి ఆటో డ్రైవర్‌గా జీవిస్తున్నాడు. అందులో భాగంగా బుధవారం ఉదయం ఆటోలో పేరేచర్ల నుంచి గుంటూరుకు వెళుతుండగా నగరవనం సమీపంలో డివైడర్‌ను ఢీకొని పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో చెన్నారెడ్డి తలకు బలమైన గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మరణించాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

నిరుపయోగంగా డంపింగ్ యార్డు

● ఇంతవరకు వాడినట్టు కనిపించని దాఖలాలు
● పగిలిపోయిన నాడెప్‌లు
● మందు బాబులకు అడ్డాగా మారిన తీరు



పగిలి పోయి ఉన్న నాడెప్‌లు



డంపింగ్ యార్డు గదిలో తాగి పడేసిన మందు బాటిళ్లు, గ్లాసులు



డంపింగ్ యార్డు పక్కనే ఉన్న కాలువలో డంప్ చేస్తున్న చెత్త

ప్రత్తిపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పల్లెలు పరిశుభ్రంగా ఉండాలి.. పంచాయతీలు ఆదాయం వైపు అడుగులు వేయాలి అనే ఉద్దేశంతో గత తెలుగుదేశం పార్టీ హయాంలో ఏర్పాటు చేసిన సంపద తయారీ కేంద్రాలు వైసీపీ హయాంలో శిథిలావస్థకు చేరాయి. గ్రామాల నుంచి వచ్చిన చెత్తను వేరు చేసి వాటి ద్వారా వర్మీ కంపోస్టు తయారు చేసి సంపద వైపు అడుగులు వేయాల్సిన గ్రామ పంచాయతీ గత ప్రభుత్వంలో తమ లక్ష్యాన్ని పూర్తిగా మరిచిపోయింది. మరలా తెలుగుదేశం ప్రభుత్వం అధికారం రావడంతోనే స్వచ్ఛ గ్రామాలను చూడాలనే ఉద్దేశంతో డంపింగ్ యార్డులను వాడుకలోకి తీసుకురావాలని పంచాయతీలకు ఆదేశాలు జారీ చేశారు. కానీ ఇంకా అధికారులు ఇంతవరకు ఆ దిశగా అడుగులు వేసిన దాఖలాలే లేవు. మండలపరిధిలోని వంగిపురం గ్రామంలోని డంపింగ్ యార్డును ఇప్పటివరకు యార్డును ఉపయోగించిన దాఖలాలు కనిపిడం లేదు. కాలువ పక్కనే డంపింగ్ యార్డును నిర్మించడంతో గ్రామంలో చెత్తను జాగ్రత్తగా తీసుకువచ్చి కాలువలో పడేస్తున్నారు. డంపింగ్ యార్డులో తడిచెత్తను వేరుచేసి వేసే నాడెప్‌లు మొత్తం పగిలిపోయి ఉన్నాయి. ఇదిలా ఉంటే డంపింగ్ యార్డు లక్ష్యం ఇక్కడ పూర్తిగా మారిపోయింది. యార్డుకు నైట్ వాచ్‌మన్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గది ఇప్పుడు మందు బాబులకు బార్‌లా మారింది. లోపల గది మొత్తం మద్యం సీసాలతో నిండి పోయింది. పగలు రాత్రి తేడా లేకుండా మందుబాబులు దీనిని అడ్డాగా చేసుకుని ఇక్కడే మద్యం తాగుతున్నారు. దీని గురించి పంచాయతీ అధికారులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు. ఓ పక్క ప్రభుత్వం చెత్త సేకరణతో పాటు డంపింగ్ యార్డు నిర్వహణ చేయాలని చెపుతున్నా ఇక్కడి అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.

గృహనిర్మాణాల పూర్తికి లబ్ధిదారులు సహకరించాలి

● సమర్థవంతంగా పనులు నిర్వహించడంపై అధికారులు దృష్టి సారించాలి
● డీపీవో, మండల ప్రత్యేక అధికారి సాయికుమార్



తుమ్మపూడిలో జరిగిన గ్రామసభలో మాట్లాడుతున్న డీపీవో సాయికుమార్, వేదికపై శ్రీఅనిత, జబీన తదితరులు

దుగ్గిరాల, డిసెంబరు 5: అభివృద్ధి పనులు సమర్థవంతంగా నిర్వహించడంపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పనులు, గృహ నిర్మాణానికి సంబంధించి మండలంలోని తుమ్మపూడి, చిలువూరు, కేఆర్ కొండూరు, పెనుమూలి గ్రామాల్లో గ్రామసభలు గురువారం నిర్వహించారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో పల్లె పండుగకు సంబంధించి క్షేత్రస్థాయిలో జరుగుతున్న పనులను పరిశీలించారు. కలెక్టర్ ఆదేశాలతో పల్లెపండుగ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో జరుగుతున్న పనులను తనిఖీ చేశారు. గ్రామాల్లో సంపద షెడ్డను పరిశీలించారు. ఎంపీపీ షేక్ జబీన, ఎంపీటీసీ వాసిరెడ్డి లక్ష్మీదేవి, సర్పంచ్ షేక్ అజీజున్, మండల టీడీపీ అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత, తోటకూర సీతారామయ్య, చిలువూరు సర్పంచ్ చిలువూరు మాణిక్యం, ఎంపీటీసీ చిలువూరు మరియ రోజమ్మ, నర్రా శ్రీనివాసరావు, పెనుమూలి సర్పంచ్ కొరిటాల పద్మావతి, గృహ నిర్మాణశాఖ ఏఈ సుబ్బారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మేడికొండూరు తహసీల్దార్‌గా హరిబాబు



మేడికొండూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మేడికొండూరు నూతన తహసీల్దార్‌గా ఎం హరిబాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నుంచి బదిలీపై మేడికొండూరు వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన కళ్యాణి కలెక్టర్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన హరిబాబు మాట్లాడుతూ ప్రజలందరికి అందుబాటు ఉంటూ మండలంలోని భూ సమస్యలు పరిష్కస్తానని చెప్పారు.

ఉపాధి హామీ పనులను సక్రమంగా నిర్వహించాలి

● డ్వామా పీడీ శంకర్

మేడికొండూరు డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులను సక్రమంగా నిర్వహించాలని డ్వామా పీడీ శంకర్ తెలిపారు. ఉపాధిహామీ పథకంపై సామాజిక తనిఖీలో భాగంగా గురువారం మేడికొండూరులో సమీక్ష చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల్లో కొన్ని చోట్ల కొబ్బరి చెట్లు నాటినట్టు చూపారని, డీఆర్‌సీ బృందం తనిఖీలో ఆయా ప్రాంతాల్లో కొబ్బరిచెట్లుకు బదులు వేరే మొక్కలున్నాయని అన్నారు. అంతేగాకుండా కూలీలకు రశీదులు కూడా ఇవ్వడం లేదన్నారు. కూలీలకు జాబ్‌కార్డులు సక్రమంగా పంపిణీ చేయడం లేదని, అప్‌డేట్‌లు కూడా ఉండటం లేదని తెలిపారు. కూలీ పంపిణీ చేసిన వారి సంతకాలు కూడా లేవని పేర్కొన్నారు. గృహ నిర్మాణ పథకంలో భాగంగా ఉపాధి హామీ పథకం కింద నిర్మించాల్సిన మరుగుదొడ్లను కొన్ని గ్రామాల్లో నిర్మించకుండానే బిల్లులు చెల్లించినట్టు తమ దృష్టికి వచ్చిందని వివరించారు. ఇటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో తోట చందన, ఏపీడీ శివన్నారాయణ, విజిలెన్స్ డీఈ హనుమంతరావు, ఏపీవో కిరణ్మయి, ఈసీ లక్ష్మిపతి, ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, జడ్పీటీసీ సభ్యులు సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

8న కాకుమానుకు కేంద్రమంత్రి రాక



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు, పారిశ్రామిక వేత్త కారుమంచి ప్రసాద్‌బాబు

కాకుమాను, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 8న కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, వ్యవసాయ, సహకార శాఖ మంత్రి కింజరపు అచ్చెన్నాయుడు కాకుమానుకు వస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు నువ్వుల సునీల్ చౌదరి తెలిపారు. కాకుమాను శివారులో ప్రసాద్ సీడ్స్ అధినేత కారుమంచి ప్రసాద్‌బాబు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం నిర్మించిన కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవంలో మంత్రి పాల్గొంటారని అన్నారు. అలాగే అగ్రికల్చర్ టెక్నాలజీ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసే స్థలాన్ని గురువారం టీడీపీ నాయకులు రాంగోపాల్, పూర్ణచంద్రరావులతో కలసి సందర్శించారు. ఈ కేంద్రంలో అధునాతన యంత్రాలు, డ్రోన్ల తయారీ తదితరాలు జరుగుతాయని ప్రసాద్ సీడ్స్ అధినేత ప్రసాద్‌బాబు తెలిపారు.

రెవెన్యూ సదస్సుల నిర్వహణపై అవగాహన

● నేటి నుంచి రెవెన్యూ గ్రామాల్లో సదస్సులు



అవగాహన సమావేశం నిర్వహిస్తున్న తహసీల్దార్ సీతారామయ్య

తాడేపల్లి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలంలో శుక్రవారం నుంచి 28వ తేదీ వరకు జరగనున్న రెవెన్యూ సదస్సులకు సంబంధించి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ డీ సీతారామయ్య అవగాహన సమావేశం నిర్వహించారు. గురువారం నిర్వహించిన ఈ సదస్సులో పలువురు నేతలు, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు. సదస్సులను విజయవంతం చేయాలని ప్రజా సమస్యల పరిష్కారానికి అందరూ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సదస్సుల వివరాలివే..

6వ తేదీన వడ్డేశ్వరం, 12న కుంచనపల్లి, 13న గుండిమెడ, 17న మున్సిపల్ కార్యాలయం, 19న ఇప్పటం, 21న మెల్లెంపూడి, 24న కొలనుకొండ, 27న ప్రాతూరు, 28న చిర్రావూరు గ్రామాల్లో ఆయా గ్రామ సచివాలయాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు.

ప్రత్తిపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పరిష్కరించేందుకు గ్రామసభలు నిర్వహిస్తాని తహసీల్దార్ కరుణకుమార్ తెలిపారు. 6వ తేదీన కొత్త మల్లాయపాలెం, 10వ తేదీన పాతమల్లాయపాలెం, 11వ తేదీన తిమ్మాపురం, 12వ తేదీన మేడవారిపాలెం, 13వ తేదీన వంగిపురం, 17వ తేదీన గనికపూడి, 18వ తేదీన ఈదులపాలెం, 19వ తేదీన గొట్టిపాడు, 20వ తేదీన నడింపాలెం, 21న కొండజాగర్లమూడి, తుమ్మలపాలెం, 27న నిమ్మగడ్డవారిపాలెం, 28న ప్రత్తిపాడు, జనవరి 2వ తేదీన కోయవారిపాలెం, 3వ తేదీన తిక్కిరెడ్డిపాలెం, 7వ తేదీన యనమదల, 8వ తేదీన కొండేపాడు గ్రామాల్లో సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

● **పెదనందిపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి):** మండలపరిధిలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం నుంచి జరిగే రెవెన్యూ సదస్సులను ప్రజలు, రైతులు సద్వినియోగించుకోవాలని తహసీల్దార్ శంకర్‌బాబు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భూసంబంధిత సమస్యలు, రీసర్వేలో తలెత్తిన సమస్యల పరిష్కారం కోసం ఈ రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

తాడికొండ డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు డిసెంబరు 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు మండల పరిధిలోని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ కె.నాసరయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబరు 6న కంతేరు, 10న మోతడక, 12న లచ్చన్న గుడిపూడి, 13న బేజాత్‌పురం, 17న ముక్కామల, 18న పాములపాడు, 20న రావెల, 24న గరికపాడు, 26న బండారుపల్లి, 27న ఫణిదరం, డిసెంబరు 31న దామరపల్లి. జనవరి 2న తాడికొండ, 3న నిడుముక్కల, 7న లాం, 8న పొన్నెకల్లు గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఫిరంగిపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో ఈనెల 6వ తేదీ నుంచి జనవరి 3వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు జరుగుతాయని తహసీల్దార్ జే ప్రసాదరావు గురువారం తెలిపారు. 6న అమనీబాద్‌లో 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామ పంచాయతీ కార్యా లయంలో, 10న 113 తాళ్లూరులో, 11న తక్కెళ్ళపాడులో, 12న శిరంగిపాలెం, 13న యర్రగుండ్లపాడు, 17న బేతపూడి, 18న గుండాలపాడు, 19న పొనుగుపాడు, 20న మేరిక పూడి, మునగపాడులలో, 24న నుదురుపాడు గ్రామంలో, 27న వేమవరం, కండ్రిక, 31న గొల్లపాలెం, రూపూడి, జనవరి 2న హౌస్ గణేష్‌లో, 3న ఫిరంగిపురం పంచాయతీ కార్యాలయంలో జరుపుతున్నామని తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యాన్నిస్వాధీనం చేసుకున్న సివిల్ సప్లైఅధికారులు

తాడికొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లాం గ్రామంలో 5.75 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే, గ్రాంలోని జహీద్ బాషాకు చెందిన ఖాళీ స్థలంలో రేషన్ బియ్యం ఉన్నట్టు స్థానికుల సమాచారం మేరకు సివిల్ సప్లై డీటీ దేవరాజ్, రెవెన్యూ అధికారులతో కలసి తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా 13 బస్తాల్లో రేషన్ బియ్యం ఉన్నట్టు గుర్తించి, ఆ బియ్యాన్ని స్థానిక డీలర్‌కు స్వాధీనం చేసి, జహీద్ బాషాపై 6ఏ కేసు నమోదు చేశారు. తనిఖీలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, వీఆర్వో ఉన్నారు.

టీడీపీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



ఎమ్మెల్యే బూర్ల నుంచి సభ్యత్వ రసీదు అందుకుంటున్న వేణు

పెదనందిపాడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ సభ్యత్వంతోనే కార్యకర్తలకు భరోసా అని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అన్నారు. పెదనందిపాడు మండలం కొప్పర్రు గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ బత్తిని శారదా భర్త వేణు గురువారం తెలుగుదేశం పార్టీ శాశ్వత సభ్యత్వం నమోదు చేసుకున్నారు. ఈ మేరకు ఆయనకు గుంటూరులోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో సభ్యత్వ పత్రాన్ని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అందజేశారు. ఈ సందర్భంగా బూర్ల మాట్లాడుతూ దేశంలో ఏ పార్టీకి లేని కార్యకర్తల బలం ఒక్క టీడీపీకే ఉందని స్వయంగా కార్యకర్తే స్వచ్ఛందంగా సభ్యత్వం నమోదు చేసుకుంటారని, దీని ద్వారా కార్యకర్తలకు భరోసా కలుగుతుందని తెలిపారు. రూ.100 చెల్లించి సభ్యత్వం నమోదు చేసుకుంటే 5లక్షలు బీమా సౌకర్యం ఉంటుందన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు కృషిచేద్దాం

పెదనందిపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేద్దామని హెచ్‌ఎం లక్ష్మీదుర్గ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో ఐసీడీఎస్, వెలుగు ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం 'బాల్యవివాహాల రహిత ఆంధ్రప్రదేశ్'లో భాగంగా అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. బాల్యవివాహాలు నిర్మూలిద్దాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం సుబ్బారావు, సీసీ శ్రీనివాసరావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న కిశోర బాలికలు

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

మంగళగిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చినకాకాని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులకు గురువారం సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ మంగళగిరి అధ్యక్షుడు గాజుల శ్రీనివాసరావు, కార్యదర్శి అందె మురళీమోహన్, సర్వీస్ ప్రాజెక్టు చైర్మన్ కాపరౌతు సుందరయ్య, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లైంగిక దాడులపై అప్రమత్తంగా ఉండాలి

● ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో సుజాతాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో సుజాతాదేవి

ప్రత్తిపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మహిళలు, చిన్నారులపై జరుగుతున్న లైంగిక దాడులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో సుజాతాదేవి తెలిపారు. ప్రత్తిపాడు, గొట్టిపాడు గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో జండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంపై అవగాహనతో పాటు చిన్నారులతో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు, బాలింతలకు అందుతున్న సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమాల్లో అసిస్టెంట్ సీడీపీవో విజయనిర్మల, సూపర్‌వైజర్లు భారతి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

నేటితో ప్రజాదర్బార్‌కు 50 రోజులు

తాడేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యువనేత, మంత్రి నారాలోకేశ్ నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ శుక్రవారంతో 50 రోజులకు చేరుకుంది. ఒక్క మంగళగిరి నియోజకవర్గం నుంచే కాకుండా రాష్ట్ర స్థాయిలో ఆయా ప్రాంతాల నుంచి సైతం ప్రజలు ఉండవల్లిలోని ప్రజాదర్బార్‌కు విచ్చేసి తమ సమస్యలను మంత్రి లోకేశ్‌కు విన్నవించుకుని పరిష్కారం పొందుతున్నారు. మంత్రి లోకేశ్ సైతం ఆయా విజ్ఞప్తులను ఓపిగ్గా పరిశీలించి అర్జీదారులకు భరోసా ఇస్తూ సంబంధిత శాఖలకు అర్జీలు బదలాయించి పరిష్కార దిశగా చేస్తున్న కృషిని ప్రజలు హర్షిస్తున్నారు. ఉదయం 6 గంటల నుంచి ప్రారంభిస్తున్న ప్రజాదర్బార్‌కు అర్జీదారులు 5 గంటల కల్లా వచ్చి అర్జీలు ఇచ్చేందుకు బారులు తీరుతున్నారు. దివ్యాంగులు సైతం కుటుంబసభ్యులతో వచ్చి లోకేశ్‌కు అర్జీలు అందజేస్తున్నారు. కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తున్నారు. ప్రజాదర్బార్ 50వ రోజుకు చేరుకోవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శ్రీదేవికి ఆర్యవైశ్య మహిళల సత్కారం



ఉండవల్లి శ్రీదేవిని సత్కరిస్తున్న ఆర్యవైశ్య మహిళలు

మంగళగిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఉండవల్లి శ్రీదేవిని మంగళగిరి పట్టణ ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు నేరెళ్ల పద్మజ, కార్యదర్శి మాజేటి శ్రీదేవి, కోశాధికారి సంకా రాధిక, డాక్టర్ గిరిజ, మాజేటి లలిత, తాడికొండ నటరాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ



చిరువ్యాపారులకు టిఫిన్ బండ్లు అందజేస్తున్న కిరణ్‌కుమార్, టీడీపీ నాయకులు

తుళ్లూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని మల్కాపురం గ్రామంలో చిరు వ్యాపారులకు టీడీపీ నాయకులు గురువారం తోపుడు బండ్లు అందజేశారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు జొన్నలగడ్డ కిరణ్‌కుమార్ ఆర్థిక సహకారంతో పేద కుటుంబాలకు చెందిన చిరువ్యాపారులు తోపుడు బండ్లు4, టిఫిన్ బండ్లు ఐదు అందించారు. మంత్రి లోకేశ్ స్ఫూర్తితో తనవంతు సాయంగా పేదలకు బండ్లు అందిస్తున్నట్టు ఈ సందర్భంగా కిరణ్ తెలిపారు. ఇప్పటివరకు మండలపరిధిలో 76మంది చిరు వ్యాపారులకు ఆయన తోపుడు బండ్లను అందించారు. కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు వేజళ్ల శివప్రసాద్, గ్రామ అధ్యక్షుడు బొర్రా నరసింహారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేలల సంరక్షణ బాధ్యత రైతులదే

● సాయిల్ సైన్స్ ప్రధాన శాస్త్రవేత్త చల్లా సుజనీరావు



రైతులకు బహుమతులు ప్రదానం చేస్తున్న శాస్త్రవేత్తలు

తాడికొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): వ్యవసాయం చేసే నేలలను సంరక్షించాల్సిన బాధ్యత రైతులు తీసుకోవాలని సాయిల్ సైన్స్ ప్రధాన శాస్త్రవేత్త చల్లా సుజనీరావు తెలిపారు. గురువారం ప్రపంచ నేలల దినోత్సవం సందర్భంగా లాంఫారంలోని ప్రాతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో గుంటూరు రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామంలో ప్రపంచ నేలల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సుజనీరావు మాట్లాడుతూ ఈ సంవత్సరం నేలల దినోత్సవ ముఖ్య ఉద్దేశం నేలల సంరక్షణ, కొలతలు, యాజమాన్యం అనే నినాదం అని చెప్పారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా నేలలను సంరక్షించుకోవచ్చని తెలిపారు. సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తూ చౌడు నేలలను పునరుద్ధరించుకోవచ్చనని తెలిపారు. రసాయనిక ఎరువులు విరివిగా ఉపయోగించరాదని సూచించారు. అనంతరం రైతులకు బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులకు క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ ప్రసూనరాణి, లాం ఫాం శాస్త్రవేత్తలు పి.సుజాత, వి.శైలజా, బి.ఆశాజ్యోతి, డాట్ కోఆర్డినేటర్‌లు వెంకటరమణ, లక్ష్మీ, వెంకట్రావులు, జొన్నలగడ్డ సర్పంచ్ శిరిషా, ఉపస్సర్పంచ్ శ్రీనివాసరావు, వ్యవసాయాధికారి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో ఎంపీ పెమ్మసాని సమావేశం రేపు

మేడికొండూరు డిశంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కేంద్ర మంత్రి, గుంటూరు పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ మేడికొండూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్లో భారీ సమావేశం శనివారం నిర్వహించనున్నట్టు టీడీపీ మండల నాయకులు గురువారం తెలిపారు. విద్యార్థుల సమస్యలతో పాటు, పాఠశాలల స్థితిగతులపై తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో కలసి ఆయన సమీక్షించనున్నారని, ఈ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన వలసిందిగా టీడీపీ నాయకులు విజ్ఞప్తి చేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

తెనాలి క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెనాలి రైల్వే స్టేషన్‌లో పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే జీఆర్‌పీ ఎస్‌ఐ జి.వెంకటరావు తెలిపారు. బుధవారం రాత్రి గుర్తు తెలియని ప్రయాణికుడు వస్తున్న రైలును గమనించకుండా మూడో నెంబరు నుంచి నాలుగో నెంబరు ప్లాట్‌ఫారం మీదకు వెళ్లడానికి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని మృతి చెందాడు. మృతుని వద్ద ఎలాంటి వ్యక్తిగత గుర్తింపు ఆధారాలు లభించలేదు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

తెనాలి క్రైం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తమ కుమార్తె అర్ధరాత్రి నుంచి కనిపించడం లేదని తల్లి వన్ టౌన్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక చినరావూరుకు చెందిన మహిళ గురువారం ఇంటర్మీడియట్ చదువుతున్న 17 సంవత్సరాల తన కుమార్తె బుధవారం రాత్రి నుంచి కనిపించడం లేదని ఫిర్యాదు చేసింది. బుధవారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి భోజనం చేసి పడుకుంది. అర్ధరాత్రి సమయంలో కనిపించలేదు. దీంతో అందరం కలిసి చుట్టుపక్కల వెదికినా ఫలితం లేకపోయిందని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తెనాలిని జిల్లా చేయాలని మంత్రులకు వినతి

కొల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెనాలిని జిల్లా చేయాలని రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేకు స్థానిక టీడీపీ నాయకులు వినతి పత్రం అందించారు. గురువారం కొల్లూరు విచ్చేసిన రాష్ట్ర మంత్రులు కొలుసు పార్థసారధి, గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఆనంద బాబులను టీడీపీ నాయకులు పబ్బిశెట్టి సత్యకుమార్ కలిసి తెనాలిని జిల్లా కేంద్రంగా చేయాలని వినతిపత్రం అందజేశారు. గాజుల్లంక, శ్రీకాకుళం కాజ్‌వే, కొల్లూరు లాకుల వంతెనలు, 30 పడకల ఆస్పత్రి, నియోజక వర్గ పునర్విభజనలో కొల్లూరును నియోజకవర్గంగా చేయాలని, జంపని చక్కెర కార్మాగారం స్థలంలో ప్రభుత్వ వైద్యశాల ఏర్పాటు చేయాలని కోరారు.

బహిరంగ మల, మూత్ర విసర్జన చేస్తే జరిమానా: కమిషనర్ శేషన్న

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ పురపాలక సంఘ పరిధిలో బహిరంగ ప్రదేశాలలో మల మూత్ర విసర్జన చేస్తే రూ.500 జరిమానా విధిస్తామని పురపాలక సంఘ కమిషనర్ శేషన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వచ్ సర్వేక్షన్, స్వచ్ఛ భారత్‌మిషన్‌లో భాగంగా దేశ స్థాయిలో స్వచ్ఛతలో మన తెనాలిని ముందంజలో ఉంచడానికి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్వయం సహాయక సంఘ సభ్యులు, ప్రజాప్రతినిధులు ప్రజలకు అవగాహ కల్పించాలని కోరారు.

రోడ్లపై చెత్తను తొలగించాలి

తెనాలి, మారీసుపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రోడ్లపై ఉన్న చెత్తను పూర్తిగా తొలగించాలని మున్సిపల్ కమిషనర్ శేషన్న పారిశుధ్య కార్మికులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని 2వ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను పురపాలక సంఘ కమిషనర్ బండి శేషన్న క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శానిటేషన్ సిబ్బందిని వార్డులో ప్రజల ఇంటి వద్ద సేకరించే తడి చెత్త, పొడిచెత్త ప్రమాదకర చెత్తను 100శాతం సేకరించాలని ఆదేశించారు.

మంత్రి మనోహర్ చిత్రపటానికి పాలాభిషేకం

తెనాలి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు నాయుడు కాలనీలో రోడ్డు సమస్యలను పరిష్కరించిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు కాలనీలోని మహిళలు కృతజ్ఞతలు తెలిపారు. సుమారు 45ఏళ్లుగా కాలనీకి సరైన రోడ్డు మార్గంలేకపోవడంతో మంత్రి మనోహర్‌ను కలిసి వారు విన్నవించుకున్నారు. దీనిపై స్పందించిన మంత్రి మనోహర్ సమస్య పరిష్కారానికి చొరవ చూపి రోడ్డు మార్గాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఆ ప్రాంత వాసులు, మహిళలు ఆనందం వ్యక్తంచేస్తూ మనోహర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుడిపై దాడికి ఖండన

తెనాలి అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాయచోటి ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిపై విద్యార్థులు దాడి చేయడం సభ్యసమాజాన్ని విస్మయానికి గురిచేసిందని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు జీవీఎస్ రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ, ఇజాజ్ అహ్మద్ అనే ఉపాధ్యాయుడిపై విద్యార్థులు దాడిచేయడం, ఆయన మృతి చెందడం తీవ్రంగా కలిచి వేసిందన్నారు. సమాజంలో జరుగుతున్న అసాంఘిక శక్తుల ప్రభావం విద్యార్థులపై పడుతోందని ఫలితంగా ఇలాంటి సంఘటనలకు తావిస్తోందన్నారు. గంజాయి తదితర మత్తు పదార్థాలను అరికట్టాలని, ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలన్నారు. ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రజాక్, పలువురు సంఘ నాయకులు సంఘటనను ఖండించి దోషులను శిక్షించాలని, ఉపాధ్యాయుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

ప్రతి నెల సమావేశాలను ఏర్పాటు చేసుకోవాలి: ఏపీఎం రమాదేవి

కొల్లిపర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు ప్రతి నెల సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాలని డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి అన్నారు. గురువారం స్థానిక స్త్రీశక్తి భవనంలో యానిమేటర్లకు, పొదుపు సంఘాల సభ్యులకు ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పొదుపు సంఘాల సభ్యులకు బ్యాంకు రుణాలపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ డ్వాక్రా మహిళలు పొదుపు ఎక్కువ చేసుకుంటే ఎక్కువ రుణాలు పొందటానికి వీలుకలుగుతుందన్నారు. మండలంలో ఇప్పటివరకు 502 గ్రూపులకు 20కోట్ల 64లక్షల రూపాయల రుణాలను ఇవ్వడం జరిగిందన్నారు. సమావేశంలో సీసీలు విజయకుమార్, మధు, ఎంఎస్‌ఏ సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యమే లక్ష్యం

ఎమ్మెల్యే ధూళిపాళ్ల

● రూ.11లక్షల పరికరాలు అందచేసిన కెన్‌ఫిన్ కార్ప్



వైద్య పరికరాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ తదితరులు

పొన్నూరు టౌన్, డిసెంబరు 5: ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు మెరుగైన వైద్యం అందించటమే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. పట్టణంలోని నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సందర్శించారు. కెన్‌ఫిన్ కార్ప్ సంస్థ కార్పొరేట్ రెస్పాన్సిబిలిటీ స్కీమ్ కింద రూ.11లక్షల విలువైన వైద్య పరికరాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రభుత్వ ఆసుపత్రికి అందచేశారు. అనంతరం ఆసుపత్రులను వివిధ విభాగాలను పరిశీలించిన నరేంద్రకుమార్ సమీక్షా సమావేశంలో మాట్లాడుతూ వైద్యుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజల నుంచి పలు ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. అత్యవసర వైద్యం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే గుంటూరు పంపుతున్నారని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రి భవనాలు, యంత్ర పరికరాలు అధునాతనమైనవిగా తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో హార్ట్‌ఎటాక్ వస్తే రూ.70వేల విలువైన ఇంజక్షన్లను ఉచితంగా అందిస్తున్నారన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న వైద్య పరికరాలు మరే ప్రైవేటు ఆసుపత్రిలో లేవన్నారు. కానీ ఓపీ సేవలు, శస్త్రచికిత్సలు ఎందుకు తక్కువగా నమోదు అవుతున్నాయని ప్రశ్నించారు. ఇకపై వైద్యులు, సిబ్బంది అలసత్వం వీడి ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు సహకారం అందించాలన్నారు. వైద్యులు, సిబ్బంది పాతపద్ధతులను అనుసరిస్తే వేరే ప్రాంతానికి బదిలీ చేయించుకోవచ్చని సూచించారు. అలాగే వైద్యులు మాట్లాడుతూ రాత్రి వేళ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు వచ్చినప్పుడు మద్యం సేవించి వచ్చే వారు తమతో దురుసుగా ప్రవర్తిస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఆసుపత్రిలో శవ పరీక్షల విభాగంలో, దోభీ ఖాళీలను బర్తీ చేయాలని కోరారు. అలాగే రోగులకు అందించే ఆహారం బిల్లులు తక్కువగా వస్తున్నందున కాంట్రాక్టర్లు ఆహారం అందించేందుకు ముందుకు రావటం లేదని పరిశీలించాలని కోరారు. వైద్య సేవలు అందించేందుకు తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే హాస్పటల్ అభివృద్ధి కమిటీ నియామకమానికి పరిశీలించాలని కోరారు. అనంతరం కెన్‌ఫిన్ కార్ప్ నిర్వాహకులను ఎమ్మెల్యే నరేంద్ర కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైద్యులు, కూటమి పార్టీల నాయకులు, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులకు నిప్పు

● పొగతో స్థానికుల ఉక్కిరి బిక్కిరి
● కాలపరిమితి ముగిసిన మందులుగా గుర్తింపు
● సిబ్బంది చర్యలపై స్థానికుల్లో ఆగ్రహం





మందులు తగలబెట్టడంతో వస్తున్న పొగ, కాలపరిమితి ముగిసిన మందులు

తెనాలి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెనాలి సుల్తానాబాద్ డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రలో కాలపరిమితి ముగిసిన మందులకు నిప్పుపెట్టిన ఘటన స్థానికంగా కలకలం రేకెత్తించింది. గురువారం ప్రాథమిక కేంద్రం పరిసరాల నుంచి పెద్దఎత్తున పొగ వెలువడుతూ భరించలేని వాసనతో స్థానిక అపార్ట్‌మెంటు వాసులు ఉక్కిరిబిక్కిరయ్యారు. దీంతో అపార్టుమెంట్ వాసులు ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించగా కాలం చెల్లిన మందులు తగలబడుతున్నారు. పేదల కోసం మందులను ప్రాథమిక కేంద్రానికి అందిస్తే అధికారుల నిర్లక్ష్యం కారణంగా అవి కాలపరిమితి తీరిపోవటంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా వీటిని గుట్టలుగా పోసి తగటబెడుతుండటంపై పలువురు అసహనం వ్యక్తం చేశారు. పట్టణానికి శివారు ప్రాంతంలో ఉన్న కేంద్రంలో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. అందుకు అవసరమైన మందులను కూడా పుష్కలంగా ఉంచుతున్నారు. అయితే ఈ ఆరోగ్యకేంద్రానికి సరైన మార్గం లేకపోవడం, పట్టణానికి శివారు ప్రాంతం కావడంతో సేవలు వినియోగించుకునే వారు అతి తక్కువగా ఉంటారు. దీంతో పలు మందులు కాలపరిమితి ముగిసిపోయాయి. వీరు మందులను ఎప్పటికప్పుడు స్టాక్ సరిచూసుకుని వాటికి అనుగుణంగానే మందుల నిల్వలు ఉంచుకోవాలి. ఈ కేంద్రంలో మాత్రం నిబంధనలు అమలు చేయక అధిక మొత్తంలో మెడిసిన్ కాలపరిమితి ముగిసాయి. అలా ముగిసిన వాటిని సైతం ఉన్నతాధికారులకు లెక్క అప్పజెప్పి వారి ఆదేశాలను పాటిస్తూ తదుపరిచర్యలు చేపట్టాలి. కానీ ఈ కేంద్రంలో మాత్రం అందుకు విరుద్ధంగా మందులు తగలబెట్టడం చర్చనీయాంశమైంది. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి ఎక్కడ లోపం జరిగిందో పరిశీలించి ప్రభుత్వసొమ్మును దుర్వినియోగం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు

● నేటి నుంచి సచివాలయాల్లో ప్రారంభం
● తహసీల్దార్ గోపాలకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ, పాల్గొన్న సర్పంచులు, వీఆర్వోలు

తెనాలి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎన్నో ఎళ్లుగా పేరుకుపోయి ఉన్న భూముల సమస్యల పరిష్కారానికి ఈ నెల 6 నుంచి జనవరి 8 వరకూ నిర్వహించనున్న గ్రామ సభలను విజయవంతం చేద్దామని మండల తహసీల్దార్ కేవీఎస్ గోపాలకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో మండల గ్రామాల్లోని సర్పంచ్‌లతో, వీఆర్వోలతో గోపాలకృష్ణ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో భూ సమస్యలున్న రైతులందరికీ సచివాలయాల్లో నిర్వహించే గ్రామ సభల ద్వారా పరిష్కరించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 6న నందివెలుగు సచివాలయంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 వరకూ, 10న సంగంజాగర్లమూడి, 12న కొలకలూరు, 17న పినపాడు (మల్లెపాడు), 19న గుడివాడ, 21న పెదరావూరు, 24న దేవరపల్లి సిరి (గుడివాడ), 26న అంగలకుదురు, 28న కఠెవరం, 31న బుర్రిపాలెం, జనవరి 2న చినరావూరు, జనవరి 4న నేలపాడు, 8న ఐతానగర్‌లలో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆయా గ్రామాల్లోని అధికారులు సిబ్బంది గ్రామ సభల నిర్వహణపై గ్రామస్థులకు తెలిసేలా దండోరా, మైక్ ద్వారా ప్రచారం చేస్తూ సమస్యలున్న ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా చూడాలని ఆయన కోరారు. సర్పంచ్‌లు, వీఆర్వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాధిక, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు తదితరులు

సుందర తెనాలి కల సాకారం చేద్దాం

● మున్సిపల్ ఛైర్‌పర్సన్ రాధిక

తెనాలి, మారీసుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణాన్ని సుందర తెనాలిగా తీర్చిదిద్దుకుందామని, ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని పురపాలక సంఘ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అన్నారు. పట్టణంలో 22వ వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను గురువారం అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రెయిన్‌లలో వస్తున్న వ్యర్థాలలో ప్లాస్టిక్ ఉండటాన్ని గుర్తించి అధికారులను ప్రశ్నించారు. పట్టణంలో మూడు బుట్టల విధానం అమలవుతుందా, ప్లాస్టిక్ నియంత్రణపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారని నిలదీశారు. దీనిపై అధికారులు తామంతా ప్రజలకు ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన కల్పిస్తున్నామని రానున్న రోజులలో మరింత కఠినంగా వ్యవరిస్తామన్నారు. మూడు బుట్టల విధానంపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వార్డు ప్రజలను చైతన్యవంతం చేసి రోడ్లపై వ్యర్థాలను వేయకుండా మున్సిపల్ సిబ్బందికి అందించేలా బాధ్యత తీసుకోవాలన్నారు. శానిటేషన్‌పై ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే సహించేది లేదని సున్నితంగా హెచ్చరించారు. ప్రజలు కూడా డ్రెయిన్‌లను ఆక్రమించి కట్టడాలను నిర్మించవద్దని, కట్టడాలు ఏమైనా ఉంటే వెంటనే తొలగించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. కార్యక్రమంలో పలు శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

● తెనాలి రూరల్ సీఐ శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ శ్రీనివాసరావు

కొల్లిపర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నూతన టెక్నాలజీ కారణంగా ప్రపంచం ముందుకు పోతోందని దానికి అనుగుణంగా సైబర్ నేరాలు కూడా పెరిగిపోతున్నాయని తెనాలి రూరల్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. గురువారం మండల పరిధిలోని బొమ్మువానిపాలెంలో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు అధికారులు వారిధి కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలకు, రైతులకు సైబర్ నేరాలతో పాటు వివిధ నేరాల గురించి అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ వివిధ రకాలుగా నమ్మబలికి మోసం చేయటానికి కొంతమంది ప్రయత్నం చేస్తున్నారని వారి బారిన పడవద్దన్నారు. నేరస్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన్ని వినియోగించుకుంటూ నగదు దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు వివరాలు, ఆధార్ వివరాలను తెలియజేయవద్దని, ఓటీపీలు చెప్పవద్దన్నారు. బ్యాంకుల్లో నగదు పోయినట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ప్రజలకు పోలీసులు ఎప్పుడూ అందుబాటులో ఉంటారన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కోటేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ ప్రార్థనలు


తెనాలి అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఐతానగర్ ప్యాడిసన్‌పేట ఈరే న్యూలైఫ్ ఫ్యామిలీ వర్షిప్ సెంటర్‌లో క్రిస్మస్ ప్రార్థనలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఉదయ కాల ప్రార్థనలో టౌన్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.సుధీర్ కుమార్ దైవసందేశం ఇచ్చారు. కృపాదానం, శ్యామ్, ఆరాధనలో పాల్గొన్నారు.

మెగా పేరెంట్స్ మీటింగ్ కోసం ప్రదర్శన



పేరెంట్స్ మీటింగ్ ఆకృతిలో మానవహారం ఏర్పాటు చేసిన విద్యార్థులు

తెనాలి అర్బన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా శాఖ తలపెట్టిన మెగా పేరెంట్స్ మీటింగ్ కోసం ఐతానగర్ హైస్కూల్ విద్యార్థులు వినూత్న ప్రదర్శన చేశారు. ఎన్ఎస్ఎస్ఎం హైస్కూల్‌లో గురువారం మీటింగ్ అక్షరాకృతిలో మానవహారంగా ఏర్పడి ఆకట్టుకున్నారు మీటింగ్ కోసం అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యార్థులతో కలిసివెళ్లి ఉపాధ్యాయులు పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వానాలు అందజేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం సునీత మాట్లాడుతూ, ఈ నెల 7న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యార్థుల తల్లిదండ్రులతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అసెంబ్లీలో పాల్గొన్న అనంతరం తమ పిల్లలతో తరగతి గదుల్లో వారి విద్యాభ్యాసాన్ని పరిశీలిస్తారు. మహిళలకు ముగ్గుల పోటీలు, పురుషులకు టగ్ ఆఫ్ వార్ నిర్వహిస్తామన్నారు. అనంతరం పాఠశాల విద్యా ప్రగతిపై తల్లిదండ్రులతో సమీక్షించి భోజన సదుపాయం అందిస్తామని తెలిపారు. బెల్లంకొండ వెంకట్, శ్రీనివాసరావు, సంపూర్ణ, విజయసింహ, విజయలక్ష్మి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సిద్ధార్థ

భూ సమస్యలు పరిష్కరించటానికే రెవెన్యూ సదస్సులు

● తహసీల్దార్ సిద్ధార్థ

కొల్లిపర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పరిష్కరించేందుకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు ఏర్పాటుచేయటం జరిగిందని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, వీఆర్ఏలతో ఆయన సమీక్ష నిర్వహించారు. రెవెన్యూ సదస్సులు ఏర్పాటుపై తగిన సూచలను సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ ఈ నెల 6వ తేదీ నుంచి జనవరి నెల 8వ తేదీ వరకు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. వీఆర్వోలు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు గురించి గ్రామాల్లో మైక్ ద్వారా ప్రచారం చేయాలన్నారు. ఈ నెల 6వ తేదీన వల్లభాపురం, 10న మున్నంగి, 12న దంతలూరు, 17 పిడపర్రు, 19న అత్తోట, 21న కుంచవరం, 24న సిరిపురం, 27న చివలూరు, 28న తూములూరు, 31న దావులూరు, జనవరి 2వ తేదీన చెముడుబాడు, 4న అన్నవరం, 7న బొమ్మువానిపాలెం, 8న కొల్లిపరలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించు కోవాలన్నారు.

మునిసిపాలిటీకి ఆదాయం పెంచేలా ప్రణాళికలు

● రెవెన్యూ ఆఫీసర్ రాంప్రసాద్





తెనాలి, మారీసుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెనాలి పురపాలక సంఘానికి ఆదాయం పెంచడానికి ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తున్నామని మున్సిపల్ రెవెన్యూ అధికారి రాంప్రసాద్ చెప్పారు. గురువారం ఆంధ్రజ్యోతితో రాంప్రసాద్ తెలిపిన వివరాలు.

ప్రశ్న: 2024 - 2025 ఆర్థిక సంవత్సరానికి ఆదాయం ఎంత వస్తుంది?

జ: 2024 - 2025 ఆర్థిక సంవత్సరానికి వివిధ పన్నులు ఇతరత్రా ఆదాయాలు సుమారు రూ.23.21 కోట్లు వస్తాయి.

ప్రశ్న: ఏఏ పన్నులు విధిస్తారు?

జ: ఇంటి, నీటి, ఖాళీ స్థలం ఇతరత్రాలపై పన్నులు విధిస్తాం.

ప్రశ్న: ఇప్పటి వరకు ఎంత వసూలు చేశారు ?

జ: ఇప్పటి వరకు 60శాతం రూ.13.71కోట్లు వసూలు చేశాం మిగిలినవి కూడా ఈ నెలాఖరులోపు వసూలు చేస్తాం.

ప్రశ్న: ఎక్కువగా వేటి బకాయిలు పేరుకొని పోయాయి ?

జ: ప్రభుత్వ కార్యాలయ భవనాల పన్నులు, నీటి పన్నులు వంటివి అధికంగా పేరుకొని పోయాయి.

ప్రశ్న: పన్నులు చెల్లించకుంటే ఎటువంటి చర్యలు చేపడతారు ?

జ: నిర్ణీత సమయంలో పన్నులు చెల్లించాలని నోటీసులు ఇస్తాం, అప్పటికి చెల్లించకపోతే పురపాలక సంఘం చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: ప్రజలకు ఏమి చెప్పాలనుకుంటున్నారు ?

జ: ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పురపాలక సంఘం ద్వారా చేపట్టే అభివృద్ధి పనులలో భాగస్వామ్యం కావాలి.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

● 8, 9 వార్డుల పర్యటనలో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ



వార్డులో సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, డిసెంబరు 5: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. గురువారం పట్టణంలోని నిడుబ్రోలు 8, 9 వార్డులో ఎమ్మెల్యే పర్యటించారు. వార్డులను శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకొని వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డు సచివాలయాలను సందర్శించి ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రేషన్ కార్డులు, పెన్షన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మురుగు నీటి కాల్వల నిర్మాణం, తాగునీరు, గృహ నిర్మాణ మంజూరు, వీధి దీపాల ఏర్పాటు, పిచ్చిమొక్కల తొలగింపు వంటి పలు సమస్యలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ రేషన్ కార్డులు, పెన్షన్ల మంజూరుకు ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేస్తుందన్నారు. అధికారులు ప్రజలందరికీ అర్హులైన వారిని గుర్తించి సంక్షేమ పథకాలు అందించేలా పనిచేయాలని సూచించారు. అలాగే 8వ వార్డులో ఎయిడెడ్ పాఠశాల భవనంలో నిర్వహిస్తున్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాల నిర్మాణానికి అనువైన ప్రాంతాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు, టీడీపీ నాయకులు జె.సుధీర్, ఎన్.రంగయ్య, పి.వాసు, పి.సాయికృష్ణ, ఎ.సోంబాబు, శోభరాజ్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు జి.వెంకట కృష్ణారావు, గురుబాలు, జనసేన నాయకులు జనసేన నాయకులు పాల్గొన్నారు.

నాలుగు రోడ్ల కూడలిలో ప్రమాదకరంగా రాళ్లు



గుంతలకు అడ్డంగా పెట్టిన రాళ్లు



తెనాలి, మారీసుపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మారీసుపేట నాలుగు రోడ్ల కూడలి వద్ద గుంతలు పూడ్చి రాళ్లను పెట్టడంతో ప్రమాదకరంగా మారింది. నిత్యం వందలాది ద్విచక్రవాహనాలు, ఆటోలు తిరిగే ఈ మార్గంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉంటే ఆ రాళ్లతో వాహనం ప్రమాదాల బారినపడే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు వాహనదారులు ప్రమాదాల బారినపడక ముందే రోడ్డుపై ఉన్న రాళ్లను తొలగించి ప్రయాణం సురక్షితంగా జరిగేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



వివిధ కళాశాలలో ఎక్స్‌లెన్స్ కేంద్రాన్ని సందర్శించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

సీమన్స్ ఎక్స్‌లెన్స్ కేంద్రం సందర్శన

పెదకాకాని, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నంబూరు గ్రామంలోని ఎస్.పి.వి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిది, పది తరగతులకు చెందిన 170మంది విద్యార్థులు నేషనల్ స్కిల్ క్వాలిఫికేషన్స్ ఫ్రేమ్ వర్క్, ఆంధ్రప్రదేశ్ సర్వశిక్షా అభియాన్ కార్యక్రమంలో భాగంగా వీవీఐటీ కళాశాలలోని సీమన్స్ ఎక్స్‌లెన్స్ కేంద్రాన్ని, ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన ల్యాబ్‌లను గురువారం సందర్శించారు. డిమానిస్ట్రేషన్ అండ్ పాపులరైజేషన్ ఆఫ్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ ఫర్ స్టూడెంట్స్ అండ్ ఫ్యాకల్టీ ప్రాజెక్టు చెందిన అధ్యాపకులు విద్యార్థులకు సాంకేతిక విద్య ఆవశ్యకత, సైన్స్ ప్రాజెక్టుకు ఆధునిక సాంకేతికత, ఇంటర్ నెట్ ఆఫ్ థింగ్స్ ఏవిధంగా రూపొందించవచ్చో వివరించారు. కళాశాలలోని ల్యాబ్‌ల వినియోగం, వాటి పనితీరును వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు ఆర్.శ్రీనివాసరావు, ఒకేషనల్ ఉపాధ్యాయురాలు బాజిమున్ని, వ్యాయామ ఉపాధ్యాయుడు సీహెచ్ కొండయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.